ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

శుక్రవారం 1 ఆగస్టు 2025



అడుగడుగునా ఉల్లంఘనలు



మాజీ ఎమ్మెల్యే ప్రసన్న ఇంటి వద్ద బారీకేడ్లను తోసేసి, విధుల్లో ఉన్న పోలీసులను నెట్టేసి దూసుకెళుతున్న వైసీపీ శ్రేణులు



- పోలీసు ఆంక్షలను లెక్కచేయని వైసీపీ
- వచ్చిన కొద్దిమందితోనే ఆర్భాటం
- రోడ్లపై గుమికూడి నానా యాగీ
- జనజీవనానికి తీవ్ర ఇబ్బందులు

వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో వైసీపీ శ్రేణులు అడుగడుగునా ఉల్లంఘనలకు పాల్పడ్డాయి. పోలీస్ ఆంక్షలను కూడా లెక్కచేయకుండా రోడ్లపై హల్‌చల్ చేశాయి. నగరంలో పోలీస్ యాక్ట్ అమలులో ఉందని తెలిసి కూడా రోడ్లపై బైఠాయించి నానా యాగీ చేశారు. పరామర్శల కోసం అనుమతులు పొంది, దానిని ఒక బలప్రదర్శన ప్రయోగంగా మార్చాలని చూశారు. జిల్లావ్యాప్తంగా 70 వేల నుంచి లక్ష మందిని జగన్ పర్యటనకు తరలించాలని వైసీపీ నేతలు భావించినా ఆశించిన స్థాయిలో సమీకరణ చేయలేకపోయారు. ఆరంభం నుంచి ఆఖరు వరకు కొంత మంది జగన్ కాన్వాయ్ ముందు పరుగెడితూ హంగామా చేశారు తప్ప ప్రజల నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు.

నెల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం, పల్నాడు జిల్లాల పర్యటనలో తలెత్తిన శాంతి భద్రతల సమస్యల దృష్ట్యా నెల్లూరులో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కొన్ని ఆంక్షలు విధించారు. ఎక్కువ మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు గుమికూడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దంటూ పోలీసులు ముందే నోటీసులు ఇచ్చారు. అయినా పెద్ద సంఖ్యలోనే వైసీపీ శ్రేణులు జగన్ పర్యటనకు తరలిరావడంతో కొన్ని చోట్ల తోపులాట జరిగింది. అయితే పోలీసులు ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జగన్ పర్యటన ముగిసేలా చర్యలు తీసుకున్నారు. గురువారం ఉదయం 10:30 గంటలకు జగన్ నెల్లూరు సెంట్రల్ జైలు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి సెంట్రల్ జైలుకు వెళ్లి రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించారు. జగన్ వెంట మిలాఖత్‌కు కాకాణి కుమార్తె పూజిత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కూడా వెళ్లారు. హెలిప్యాడ్ వద్దకు జగన్ కాన్వాయ్‌తోపాటు మరో మూడు వాహనాలకు మాత్రమే పోలీసులు అనుమతిచ్చారు. అయితే పదుల సంఖ్యలో వాహనాలు హెలిప్యాడ్ వద్దకు వెళ్లాయి. లెక్కకు మించి వైసీపీ నాయకులు, కార్యకర్తలు హెలిప్యాడ్ ప్రాంగణం వద్ద గుమికూడారు. మాజీ మంత్రి అనీల్‌కుమార్ యాదవ్ కూడా పోలీసులు అడుగుతున్నా తన కారు ఆపకుండా హెలిప్యాడ్ వద్దకు వెళ్లడం గమనార్హం. వచ్చింది కొద్దిమందే అయినా వీరంతా జైలు రోడ్డు వద్ద జాతీయరహదారిపై గుమికూడటంతో చాలాసేపు ట్రాఫిక్ ఆగిపోయింది. దీంతో వాహనదారులే కాదు.. సామాన్య ప్రజానీకానికీ చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. జైలు నుంచి రోడ్డు మార్గాన నెల్లూరులోని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఈ మార్గంలో కొన్ని చోట్ల వైసీపీ శ్రేణులు గుమికూడటంతో కాన్వాయ్ ఆలస్యంగా నడిచింది. షెడ్యూల్ ప్రకారం అర్ధగంటలో ప్రసన్న ఇంటికి చేరుకోవాల్సి ఉండగా, రెండు గంటల సమయం పట్టింది.

● పోలీసులు చెప్పినా..

నగరంలో పోలీసు యాక్ట్ అమల్లో ఉంది. ఎక్కువ మంది ఒకచోట గుమికూడదని పోలీసులు ప్రకటించారు. ఆ క్రమంలోనే జగన్ పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఇంటి వద్దకు జగన్ వచ్చే సందర్భంగా వంద మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. ఇతరులెవరూ అక్కడకు రాకుండా వీధుల్లో భారీకేడ్లు ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ శ్రేణులు అంబేడ్కర్ భవన్ ప్రాంతానికి భారీగా చేరుకున్నారు. వీరిని పదే పదే అక్కడ నుంచి పోలీసులు పంపేస్తున్నా మళ్లీ వచ్చి చేరిపోయారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈలోపు ప్రసన అక్కడకు చేరుకున్నారు. తమ నాయకుడికి అంబేడ్కర్ భవన్ నుంచే స్వాగతం పలుకుతామంటూ ప్రకటించారు. అందుకు అనుమతి లేదని పోలీసులు నచ్చచెప్పినా వినిపించుకోలేదు. ఒక్కసారిగా వైసీపీ శ్రేణులు అక్కడ గుమికూడటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ శ్రేణులను పోలీసులు పక్కకు లాగేశారు. దీంతో ప్రసన్నకుమార్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించారు. ఇంతలో జగన్ కాన్వాయ్ అక్కడకు చేరుకోవడంతోనే ప్రసన్న కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు. అదే సమయంలో కార్యకర్తలు భారీ సంఖ్యలో బారీకేడ్లను తోసుకుంటూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. జగన్ కారు కంటే ముందు పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో కలిసి ప్రసన్న నడుచుకుంటూ వచ్చి పోలీసులు ఏర్పాటు చేసిన బారీకేడ్లను తోసుకుంటూ ముందుకు సాగారు. దీంతో అక్కడే ఉన్న ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ మాలకొండయ్య కిందపడటంతో ఆయన కుడి చేయి విరిగిపోయింది. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే ఆయన్ను కిమ్స్ వైద్యశాలకు తరలించారు. కొందరు గోడలు దూకుకుంటూ వచ్చారు. అయితే ఎక్కడా పరిస్థితులు చేజారకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రసన్న ఇంటికెళ్లాక వారి కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు. ఇంటిపై జరిగిన దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరిగి సెంట్రల్ జైలు సమీపంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకొని బెంగళూరుకు తిరుగు పయనమయ్యారు.

కేసుల నమోదు

నెల్లూరు(క్రైం) : జగన్ పర్యటనలో వైసీపీ నాయకులు నిబంధనలు ఉల్లంఘించడంపై గురువారం రాత్రి దర్గామిట్ట పోలీసులు కేసులు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి జరిగిన తోపులాటలో గాయపడిన హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ప్రసన్నతోపాటు కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్, మరికొందరిపై కేసు నమోదు చేశారు. అలాగే రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టిన ప్రసన్నపై మరో కేసు నమోదు చేశారు.



అన్నదాత సుఖీభవ
నిధులు రేపు జమ

● 1,86,368 మంది రైతులకు లబ్ధి

నెల్లూరు(వ్యవసాయం), జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకం కింద 1,86,368 మంది రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2వ తేదీన పెట్టుబడి సాయం నిధులు జమ చేయనున్నారని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక రైతు కుటుంబానికి ఏడాదికి కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు కలిపి రూ.20వేలు మూడు విడతల్లో జమ చేస్తారని పేర్కొన్నారు. కౌలు రైతు ధృవీకరణ పత్రం కలిగిన భూమి లేని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10వేలు చొప్పున రెండు విడతలుగా రూ.20వేలు వారి ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. ఈనెల 2వ తేదీన మొదటి విడత పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ నిధుల విడుతలకు ప్రభుత్వ రంగం సిద్ధం చేసిందని పేర్కొన్నారు. ఈకేవైసీ పూర్తి చేసుకుని, ఎన్‌పీసీఐ లింకు కలిగి ఉన్న 1,86,368 రైతు కుటుంబాలకు మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5వేలు, కేంద్ర ప్రభుత్వం తరపున 20వ విడతగా 1,68,000 మందికి రూ.2వేలు వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని తెలిపారు. మొదటి విడతలో అర్హత పొందని అర్హులైన రైతులు వాటికి సంబంధించిన కారణాలను సరిచేసుకుంటే రెండో విడతలో నగదు జమ అవుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

నేడు, రేపు మెగా జాబ్‌మేళా

● ఆత్మకూరులో విస్తృత ఏర్పాట్లు

ఆత్మకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మెట్టప్రాంత యువత ఉజ్వల భవిష్యత్ కోసం రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరులో మెగా జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆత్మకూరులోని ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళాను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి, పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొననున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న జాబ్ మేళాలో తొలిరోజు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, రెండవ రోజు అభ్యర్థుల అర్హతల మేరకు నియామకపత్రాలను ఆయా కంపెనీలు అందజేస్తాయి. సుమారు 100 వరకు రాష్ట్ర, జాతీయ స్థాయి కంపెనీలు ఈ మేళాలో పాల్గొననున్నాయి. ఇప్పటికే ఆత్మకూరు ఆర్డీవో బీ పావని, అధికారులు ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యను పూర్తి చేసుకున్న అభ్యర్థుల జాబితాను తయారు చేసి వారందరూ జాబ్‌మేళాకు హాజరయ్యేలా చర్యలు చేపట్టారు. జాబ్‌మేళా ఏర్పాట్లపై పలుమార్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులతో సమీక్షలు నిర్వహిం దిశనిర్దేశం చేశారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారికి రవాణా సౌకర్యాలతోపాటు అన్ని సదుపాయాలు సమకూర్చారు. ఒక్క ఆత్మకూరు నుంచే కాకుండా జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగ, ఉపాధి అంకాశాలను పొందాలని మంత్రి ఆనం పిలుపునిచ్చారు.



ఆగస్టు కోటాలోనూ లేనట్లే...

నెలల తరబడి కార్డుదారుల ఎదురుచూపులు

నెలల తరబడి
కందిపోతున్నాం!

ఉదయగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెల్లరేషన్ కార్డుదారులకు ఆగస్టునెల కోటాలోనూ కందిపప్పు అందలేదు. ప్రభుత్వం జూన్‌లో ఎండీయూ వాహనాలను రద్దు చేయగా, 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందుల్లేకుండా ప్రతినెలా 26 నుంచి 30తేదీ లోపు వారి ఇంటివద్దకే డీలర్లు వెళ్లి సరుకులు పంపిణీ చేస్తున్నారు. అయితే ఈనెలాఖరులో ఇచ్చిన సరుకుల్లో కందిపప్పులేదు. మిగిలిన కార్డుదారులకు చౌకదుకాణాల ద్వారా శుక్రవారం (రేపటి) నుంచి నిత్యావసర సరుకులు పంపిణీ చేయను న్నారు. వారికి బియ్యం, పంచదార మాత్రమే అందించ నున్నారు. ప్రభుత్వం ప్రారంభంలో కార్డుదారులకు అన్నీసరుకులను పంపిణీ చేసింది. అనంతరం కొన్ని నెలలపాటు 50శాతం మంది కార్డుదారులకే కందిపప్పు పంపిణీ చేసింది. ఆ తరువాత ఆరు నెలలుగా కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో కార్డుదారులకు బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు.

● బయట కొనలేక...

జిల్లాలో సుమారు 1,894 చౌక దుకాణాలు ఉండగా, అందులో 8.65 లక్షలమంది కార్డుదారులు ఉన్నారు. వారికి నెలల తరబడి కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో వారు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు నాణ్యతను బట్టి రూ.110ల నుంచి రూ.130ల వరకు ఉంది. చౌక దుకాణాల ద్వారా కేవలం రూ.67లకే అందిస్తున్నారు. ఇది కార్డుదారులకు ఎంతో ఉపశమనం కలిగించనుంది. కందిపప్పు కోసం కొంతమంది కార్డుదారులు డీలర్లతో వాదనకు దిగుతుండడంతో వారు సమాధానం చెప్పలేకున్నారు.

బొప్పాయికి గిట్టుబాటు ధర కల్పించాలి

కలిగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ గురువారం కలిగిరిలో అన్నదాత లు రోడ్డెక్కారు. తహసీల్దారు కార్యాలయ కూడలిలో బొప్పాయి కాయలను రోడ్డుపై పోసి తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ స్థానిక దళారులు కిలో రూ.15 వంతున కాయలను కొనుగోలు చేస్తామని తమకు చెప్పి తీరా పంట చేతికొచ్చాక రూ.5 మాత్రమే ఇస్తామంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ధరకు కాయలను అమ్మితే పెట్టుబడులు కూడా రావని అప్పులపాలవుతామని వాపోయారు. దళారుల జోక్యాన్ని నివారించి ప్రభుత్వమే బొప్పాయి పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో రైతులు కాకూరు విష్ణువర్ధన్ రెడ్డి, సంగన గోపాల్‌రెడ్డి, ఆరికల శ్రీను, సోము రాజారెడ్డి, శివకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



రోడ్డుపై బొప్పాయి కాయలు పోసి తగలబెడుతున్న రైతులు

ఇద్దరు ఎంఈవోల వ్యవస్థతో ఇక్కట్లు

విద్యారంగంలో పేరుకుంటున్న సమస్యలు



ఆధిపత్య పోరు

నెల్లూరు(విద్య), జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఇద్దరు ఎంఈవోల నియామకం ఆధిపత్యపోరుకు దారితీస్తోంది ఎవరికివారు తమ ప్రతిష్టను కాపాడుకునేం దుకు, విద్యాశాఖలో తమ అధికారాన్ని చూపేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో విద్యారంగంలో సమస్యలు పేరుకుపోతున్నాయని ఉపాధ్యా యులు చెబుతున్నారు. ప్రభుత్వ పథకాలు, పాఠశాలల పర్యవేక్షణ, టీచర్ల పనితీరు పరిశీలన, విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచడం తదితర కార్యకలాపాలకు ఉద్దేశించిన ఎంఈవో-1, 2 వ్యవస్థలు ప్రస్తుతం అవస్థలతో నడుస్తున్నాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఒకే పనికి ఇద్దరు సమానహోదా కలిగిన అధికారులతో క్షేత్రస్థాయిలో ఎదురవుతన్న ఇబ్బందులను టీచర్లు ఏకరువు పెడుతున్నారు.

● నిరుత్సాహం, అసంతృప్తిలో ఎంఈవో-2లు

విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, పరిష్కరించేందుకు గత ప్రభుత్వంలో ఎంఈవో-1, 2ల వ్యవస్థ ఏర్పాటైంది. ప్రస్తుతం ఎంఈవో-2లు తీవ్ర నిరుత్సాహం, అసంతృప్తితో విధులు నిర్వహిస్తున్నారు. ఎంఈవో-1 మాత్రం మండలాల్లో తామే సర్వస్వం అని, ఏదైనా తమ అనుమతి లేనిదే చేసేందుకు వీలులేదన్న వాదనలు వినిపిస్తున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. జిల్లాలోని 38 మండలాల్లో కీలకమైన ఎంఈవో-1లు 18 మండలాల్లో రెగ్యులర్‌గా ఉండగా, మిగిలిన 20 మండలాల్లో మాత్రం ఇన్‌చార్జులు పనిచేస్తున్నారు. వీరిలో కూడా రెగ్యులర్ ఎంఈవో-1లు ఇతర ప్రాంతాల్లో కూడా ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఎంఈవో-2కు సంబంధించి అన్నీ మండలాల్లో రెగ్యులర్ అధికారులు ఉండగా ఒక్క సీతారామపురంలో మాత్రం ఎవరినీ నియమిం చలేదు. పక్క మండలం ఎంఈవోనే ఇక్కడ పర్యవేక్షిస్తున్నారు. అయితే ఇద్దరు ఎంఈవోల వ్యవస్థ కారణంగా అసమానతలు ఏర్పడుతున్నాయని, ఇద్దరినీ ఏకీకృతం చేసే ఫార్ములా ద్వారా ఒక్కరినే నియమించడం

- మిగతా 7లో

నేటినుంచి
'స్పౌజ్' పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), జూలై 31 (ఆంధ్రజ్యోతి): కొత్త స్పౌజ్ (భర్త మరణిస్తే భార్యకు ఇచ్చే పింఛను) పెన్షన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. శుక్రవారం నుంచి ఈ పెన్షన్ సొమ్ము పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. కొన్ని నెలలుగా కొందరు ఎమ్మెల్యేలు, కొందరు నాయకులు అడ్డుపుల్ల వేయటంతో పంపిణీకి బ్రేకులు పడ్డాయి. వాస్తవంగా జూన్ 12వ తేదీనే స్పౌజ్ పెన్షన్ల పంపిణీకి జిల్లాలో అన్ని ఏర్పాట్లు జరిగాయి. ఆ తర్వాత ఎందుకనో వాయిదా పడింది. ఆ తరువాత జూలై 1న పాత వితంతు పెన్షన్లతో కలిపి పంపిణీ చేయాలని నిర్ణయించారు. రెండవ సారి కూడా వాయిదా పడింది. గత ప్రభుత్వంలో చనిపోయిన వారికి పెన్షన్లు ఎలా ఇస్తారని కొందరు టీడీపీ నాయకులు అడ్డుపుల్ల వేసినట్లు తెలిసింది. కొందరు ఎమ్మెల్యేలు కూడా బాధితులెవరూ తమ వద్దకు వచ్చి పెన్షన్లు మంజూరుచేయించమని అడగలేదని, పెన్షన్లు పంపిణీ చేయవద్దని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. స్పౌజ్ పెన్షన్లన్నీ అర్హమైనవని ఒక కొత్త అంశాన్ని లేవనెత్తినట్లు సమాచారం. మళ్లీ వాటిని తనిఖీ చేయించాలని కోరినట్లు సమాచారం. దీంతో ఆ పెన్షన్ల పంపిణీ ఆగిపోయింది. అన్ని అంశాలు పరిశీలించాక స్పౌజ్ పెన్షన్లను ఆగస్టు 1 నుంచి పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో కొత్తగా 5489 మంది అర్హులైన స్పౌజ్ పెన్షనర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలో ఇప్పటి వరకు 80,235 మంది వితంతు పింఛనుదారులు ఉన్నారు. ఇప్పుడు మొత్తం కలిపి పింఛనుదారుల సంఖ్య 85724లకు చేరుకుంది.

రామాయపట్నం పోర్టు సమీపంలో రాడార్ కేంద్రం

● స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కలిసిన సెంట్రల్ మెరైన్ సిబ్బంది



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న సెంట్రల్ మెరైన్ అధికారులు, సిబ్బంది

కందుకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టుకు సమీపంలో రాడార్ కేంద్రం ఏర్పాటు కానుంది. ఇక్కడ మంజూరైన రాడార్‌కేంద్రానికి రామాయపట్నం పరిసరాల్లో అనువైన స్థలాన్ని కేటాయించాలని సెంట్రల్ మెరైన్ సిబ్బంది శుక్రవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి విజ్ఞప్తి చేశారు. రాడార్ కేంద్రం ఏర్పాటు వల్ల నౌకల రాకపోకలు, సముద్రంలోని పరిస్థితులను సులువుగా అంచనా వేసేందుకు అవకాశం ఏర్పడుతుందని ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకి వివరించారు. అంతేగాక నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని మత్స్యకారులకు కూడా ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లిన సమయాల్లో వారి స్థితిగతులను అంచనా వేయటం, ఏ ప్రదేశంలో వారు ఉన్నారో గుర్తించడం సులువవుతుందని ముఖ్యంగా ప్రకృతి విపత్తుల సమయంలో మత్స్యకారులకు ఈ కేంద్రం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని వారు వివరించారు. నౌకాయాన రక్షణతోపాటు సముద్రతీరంలోని ప్రజలకు కూడా ఈ కేంద్రం వరంగా మారుతుందని తెలిపారు. రాడార్ కేంద్రం నిర్మాణ కోసం ఒకటిన్నర ఎకరం స్థలం అవసరమవుతుందని, ప్రస్తుతం ఉన్న రామాయపట్నం మెరైన్ పోలీసు స్టేషన్ పరిసరాల్లో అనువైన స్థలాన్ని ఎంపికచేయించాలని వారు కోరారు.

కొత్తగా 121 స్పౌజ్ పింఛన్లు

మనుబోలు, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఆగస్టు నెల నుంచీ ప్రభుత్వం కొత్తగా 121 స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ముజీబున్నీసా గురువారం తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 5507మందికి సామాజిక పింఛన్లు ఇస్తున్నామన్నారు. కొత్తవాటితో కలిపి 5628 మంది సామాజిక పింఛన్లతో పాటు ఇతర పింఛన్ల ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఆగస్టు నెలకు రూ. 2.43 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని శుక్రవారం లబ్ధిదారులకు అందించనున్నారని ఆమె తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9472
వెండి కిలో ధర	రూ. 114000
వెండి ఒక గ్రాము	రూ. 117.00

కుట్టు శిక్షణ కేంద్రం తనిఖీ



తనిఖీ చేస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ

రాపూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిర్మలాదేవి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో దశరథరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చంద్ర, బీసీ కార్పొరేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల బోధన శిక్షణకు పాటూరు ఉపాధ్యాయిని



కేశవర్ధినిని సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

కోవూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో శుక్రవారం నుంచి జరగనున్న దక్షిణ భారత స్థాయి రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జరగనున్న ఆంగ్ల బోధన శిక్షణ తరగతులకు పాటూరు ఉన్నత పాఠశాల ఆంగ్లభాషోపాధ్యాయిని జాలాది కేశవర్ధిని ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జుల్ఫికర్ అలీ తెలిపారు. జిల్లా నుంచి ఆమె ఒక్కరే ఎంపికకావడంతో గురువారం ఆమెను పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రమోహన్, ఉమామహేశ్వరి, సతాజ్, విజయకుమారి, అరుణ, శేషయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జట్లకొండూరులో 'పొలంబడి'



సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

మనుబోలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జట్లకొండూరు పంచాయతీలో వ్యవసాయాధికారులు గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పొలం వద్ద రైతులను సమావేశపరిచి సాగులో యాజమాన్య పద్ధతులపై వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య వివరించారు. తక్కువ ఖర్చుతో నాణ్యత కలిగిన పంట తయారీపై అవగాహన కల్పించారు. పంటలో పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే సుడోమోనాస్‌తో పాటు ట్రైకోగ్రామా పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శ్రీదేవి, టీడీపీ నాయకులు వెందోటి భాస్కర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉదయగిరి ఎంఈవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

ఉదయగిరి, జూలై 31(ఆంధ్ర జ్యోతి): ఉద యగిరి మం డల విద్యా శాఖాధికారి-1గా తిప్పి రెడ్డి వెంకటేశ్వర్లు గురువారం బాధ్య తలు స్వీకరించారు. ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయ న్ను ఉన్నతాధికారులు ఉదయగిరి ఎఫ్ఏసీ ఎంఈవోగా బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో మండలంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

సులభంగా బోధించాలి

ఉదయగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవో తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టణంలోని బీసీ కాలనీ ఆదర్శ తెలుగు ప్రాథమిక పాఠశాలను వారు సందర్శించారు. ఆకర్షించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

'రుచి'కరమైన ఉపాధి!

● ఆహారశుద్ధి యూనిట్లకు ప్రోత్సాహం

● పూచీకత్తు లేకుండా రూ.10 లక్షల రుణం





పొదలకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఇప్పుడు కేవలం డిగ్రీలు ఉన్నవాళ్లకే కాదు.. వ్యక్తిగత నైపుణ్యాలు ఉంటే ఉపాధి అవకాశాలు చాలానే ఉన్నాయి. పచ్చళ్లు.. కారం.. మసాలా పొడుల తయారీ.. వడియాలు పెట్టడం.. ఇలాంటివాటిలో ప్రావీణ్యం ఉన్నవారు ఇంటి పట్టున ఉంటూనే ఉపాధి పొందవచ్చు. మినీ దాల్‌మిల్లులు, పప్పులు, చిరుధాన్యాల ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి లాభాలు గడించొచ్చు. ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి కల్పించాలని ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఎలాంటి పూచీకత్తు లేకుండానే రుణాలు అందిస్తారు. యూనిట్ ఏర్పాటు కయ్యే ఖర్చులో సొంత వాటాగా 10 శాతం పెట్టుబడి పెడితే చాలు.

● రూ.5 లక్షల లోపు యూనిట్..

పిండిమరలు, వెజ్, నాన్‌వెజ్ పచ్చళ్లు, మిరప, పసుపు, మసాల పొడులు, కొబ్బరిపొడి, అరటి చిప్స్, రొట్టెలు, కేకులు, ఇడ్లీ, దోశ పిండి తయారీ, ప్యాకింగ్, అప్పడాలు, వడియాలు, వేరుశనగ చెక్క, ఫ్లేవర్డ్ మిల్స్, సోలార్ డీహైడ్రేషన్.

● రూ.5 నుంచి 10 లక్షల లోపు..

వంటనూనెలు, చాక్లెట్లు, సేమియా, చిరుధాన్యాల ఆధారిత ఉత్పత్తులు, చపాతి, పరోటా, అరటి పొడి, పశువుల దాణా తయారీ, మిల్లెట్ ఫ్లేక్స్, అల్లం -వెల్లుల్లి పేస్ట్, నన్నారి, పండ్ల జామ్.

● రూ.10 నుంచి 20 లక్షలు..

ధాన్యం, పప్పు మినీ మిల్లులు, తేనెశుద్ధి, నూనెల తయారీ, చిరుధాన్యాలు.

● రూ. 20 నుంచీ 35 లక్షలు...

ఐస్‌క్రీమ్, స్క్వాష్‌లు, చపాతి, పరోటా, మిల్లెట్ పాస్తా, సోయా ప్రాసెసింగ్, రవ్వ, పిండి యూనిట్లు, పిల్లల పోషకాహారం తయారీ

● రూ.35 నుంచి 50 లక్షలు.. ఆ పైన..

కాఫీ ప్రాసెసింగ్, పశువుల దాణా, లెమన్ ప్రాసెసింగ్, చేపలు, మాంసం ప్రాసెసింగ్, మిల్క్ చిల్లింగ్, మొక్కజొన్నల ఆధారిత ఉత్పత్తులు, పండ్ల రసాల యూనిట్లు.

● ఎవరు అర్హులు..?

18 సంవత్సరాల పైబడినవారు. ఎలాంటి విద్యార్హత అవసరం లేదు. కొత్తవారు, ఇప్పటికే పరిశ్రమలు నిర్వహిస్తున్నవారు ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ. లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ఆహారశుద్ధి పరిశ్రమలకు రుణాలు పొందే అవకాశం ఉంది. వ్యక్తిగత వ్యాపారులు, డ్వాక్రా మహిళా సంఘాలు, కో ఆపరేటివ్ సొసైటీలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యాజమాన్య సంస్థలు, భాగస్వామ్య సంస్థలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో తమ పరిశ్రమను విస్తరించాలని భావించే వారు లేదా కొత్త పరిశ్రమ స్థాపించాలనుకునే వారూ అర్హులే.

● మెళకువలూ నేర్పిస్తారు..

పొదుపు మహిళలకైతే రాయితీ రుణంతో పాటు సంఘం ద్వారా ఒక్కొక్కరికి అదనంగా రూ.40వేల చొప్పున సాయం అందిస్తారు. ముడి సరుకు, ప్యాకింగ్, ఇతర పెట్టుబడికి ఈ మొత్తాన్ని ఉపయోగించుకొని తర్వాత చెల్లించాలి. వ్యాపారాభివృద్ధికి అవలంబించాల్సిన ఆధునిక పద్ధతులు, పరికరాల వాడకం, ఇతర అంశాల్లో నిపుణులతో శిక్షణ ఇప్పిస్తారు. సంఘటిత రంగంలో ఉన్న పెద్ద పెద్ద రిటైల్ వ్యాపారులను సమన్వయపరుస్తూ పెద్ద బ్రాండ్లకు దీటుగా, పోటీగా నిలిచేలా బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తారు.

● దరఖాస్తు చేసుకోండిలా...

పరిశ్రమను నెలకొల్పాలనుకునేవారు పీఎంఎఫ్ఎంఈఏపీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, పాన్‌కార్డు, యూనిట్ చిరునామా ధ్రువీకరించే పత్రం (విద్యుత్/వాటర్/ ఫోన్/ గ్యాస్‌బిల్లులు) యూనిట్ నిర్వహించే భవనం/ భూమి యాజమాన్య ధ్రువీకరణ పత్రం. గత 6 నెలల బ్యాంకు స్టేట్‌మెంట్, యంత్రాలు, షెడ్‌కు సంబంధించిన కొటేషన్లను అప్‌లోడ్ చేయాలి. ఆహారశుద్ధి పరిశ్రమలకు రూ. కోటి వరకు రుణం పొందే అవకాశం ఉంది. యూనిట్ వ్యయంలో లబ్ధిదారు వాటా 10 శాతం, 90 శాతం బ్యాంకు రుణం ఉంటుంది. ఇందులో 35 శాతం రాయితీ పోగా 55 శాతం రుణాన్ని బ్యాంకుకు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. పరిశ్రమను నెలకొల్పిన తర్వాత 3 నెలల్లోపు రాయితీ సొమ్ము బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది.

● ఎవరిని సంప్రదించాలి..?

నెల్లూరు జిల్లా పీఎంఎఫ్ఎంఈ (ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ) ఈడీ శ్రీనివాసులు, సెల్ : 79950 87051.

నిధుల దుర్వినియోగంపై బహిరంగ విచారణ

● వెంకటాచలం పంచాయతీపై విచారణ కమిటీ ఏర్పాటు

వెంకటాచలం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్లు టీడీపీ నేత సండి రమేష్, పలువురు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం డీపీవో శ్రీధర్‌రెడ్డి విచారణ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇప్పటికే సర్పంచ్ మందల రాజేశ్వరికి షోకాజు నోటీసు జారీ చేశారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు సాధారణ నిధుల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. సర్పంచ్‌తో సహా అక్కడ పనిచేసిన ప్రత్యేకాధికారి, కొందరు పంచాయతీ కార్యదర్శులు బాధ్యు లుగా ఉన్నారన్నారు. సర్పంచ్ తన భర్త మం దల వెంకటశేషయ్యను కాంట్రాక్టరుగా చూపించి కొందరు పంచాయతీ కార్యదర్శుల సహకారంతో భారీగా నిధులను దుర్వినియోగం చేశారంటూ ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో విచారణ కమిటీ హెడ్‌గా కావలి డివిజనల్ పంచాయతీ అధికారి పీ వెంకటరమణ, సభ్యులుగా బోగోలు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ నయీం తాజ్ హుస్సేన్, కావలి డివిజనల్ పంచాయతీ కార్యాలయ పరిపాలనాధికారి పీ సురేష్‌కుమార్, నెల్లూరు డివిజనల్ పంచాయతీ కార్యాలయ పరిపాలనాధికారి ఆర్ మాలకొండయ్యలను నియమిస్తూ డీపీవో ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీలో బహిరంగ విచారణ నిర్వహించి కమిటీ నివేదికను అందజేయనుంది.

అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించుకోండి

'బుచ్చి' చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బుచ్చిరెడ్డిపాళెం పట్టణ పరిధిలోని అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని చైర్‌ప ర్సన్ మోర్ల సుప్రజ కోరారు. కౌన్సిల్ కార్యాల యంలో గురువారం జరిగిన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అక్రమ లే అవుట్లను క్రమబద్ధీక రించుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయ న్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకా రంతో నగరపంచాయతీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. నగర పంచాయతీ పరిధిలో 21 పనులు చేపట్టేందుకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ బాలకృష్ణ, అధికార, ప్రతిపక్ష సభ్యులు, కో ఆప్టెడ్ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాలిసెట్‌కు స్పాట్ అడ్మిషన్లు

కావలి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం రుద్ర కోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆగస్టు 2వ తేదీ నుంచి 5వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ గురు వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పాస్ అయినవారు, ఇంటర్ పాస్/ ఫెయిల్, ఐటీఐ పాస్/ఫెయిల్ అయిన వారు, 2025కు అసలు పాలిసెట్‌కు అప్లయ్ చెయ్యనివారు కూడా స్పాట్ అడ్మిషన్లకు అర్హులన్నారు. అభ్యర్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, 4వ నుంచి 10వ తరగతి వరకు చదివిన పాఠశాలల స్టడీ సర్టిఫికేట్లు, పాలిసెట్‌కు దరఖాస్తు చేసి పరీక్ష రాసినవారు హాల్‌టికెట్, అర్హత సాధిం చినా, లేకున్నా ర్యాంక్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తదితర సర్టిఫికెట్లతో పాటు రూ.5800 అడ్మిషన్లకు ప్రవేశ రుసుంతో రావాలన్నారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్సుమెంట్ సదుపాయం లేదన్నారు. తమ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ), సివిల్ ఇంజనీరింగ్ శాఖలు అందుబాటులో ఉన్నాయన్నారు.

నాగేశ్వర స్వామి ఆలయం పరిశీలన

చేజర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్ళపాడు సమీపంలోని నాగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం ఆదేశాలతో గురువారం రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు ఇసుకలో పూడిపోయిన దేవాలయాన్ని పరిశీలించారు. రాష్ట్ర దేవదాయ శాఖ స్థపతి పి పరమేశ్వరప్ప, గుం టూరు డిఈఈ శ్రీనివాసులు, నెల్లూరు ఏఈ పి.సురేంద్ర, సహాయక స్థపతి సురేంద్ర ఇతర అధికారులు పరిశీలించి అలయ నిర్మాణానికి సంబంధించి తగిన ప్రతిపాదనలతో నివేదికలను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జయం తులునాయుడు తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



పెట్రోలు బంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి దంపతులు

కోవూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఇనమడుగులో గురువారం పడుగుపాడు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పెట్రోల్ బంకును ఆమె ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పడుగుపాడు సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు నిర్వహించడం అభినందనీయమన్నారు. రైతుల కు సేవలందించడంలో సొసైటీ కృషి అభినందనీయమని, జిల్లాలోని అన్ని సొసైటీలకు మార్గదర్శకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఎన్‌డీసీసీ చైర్మన్ మెట్టుకూరు ధనుం జయ రెడ్డి, ఎంపీపీ పార్వతి, టీడీపీ నాయకులు చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి, కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి, కోడూరు కమలాకర రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కట్టా సుబ్రహ్మణ్యం, సీఈఓ కే గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొట్లపాళెంలో పౌరహక్కుల దినోత్సవం



చట్టాలపై దళితులకు అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

మనుబోలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లపాళెం గిరిజన కాలనీలో గురువారం పౌర హక్కుల దినోత్సవాన్ని రెవెన్యూ అధికారులు నిర్వహించారు. జస్టిస్ పున్నయ్య కమీషన్ ఆదేశాల మేరకు ప్రతినెలా దళిత, గిరిజన కాలనీల్లో పౌర హక్కుల దినోత్సవాన్ని రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్నారు. ఎవరైనా కులంపేరుతో దూషిం చినా, వివక్ష చూపి అవమానించినా వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. గిరిజన చట్టాలపై రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, ఆర్ఐ. అరుణ్‌బాబు, వీఆర్‌వో గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మినగల్లు సీజేఎఫ్ఎస్ భూమి పరిశీలన



భూమిని పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మినగల్లు గ్రామ పరిధిలోని సీజేఎఫ్ఎస్ భూమిని సర్వే అధికారులు గురువారం పరిశీలించారు. సుమారు 100 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూమి అన్యాక్రాంతమైనట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో అధికారులు సర్వే చేశారు. సర్వే విభాగం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రఘురామరాజు, డిప్యూటీ ఐఓఎస్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వేయర్లు పాపిరెడ్డి, సోమశేఖర్ సర్వే చేశారు. వారి వెంట వీఆర్వో వెంకటేశ్వర్లు, విలేజ్ సర్వేయర్ అనీష్ తదితరులున్నారు. టీడీపీ నాయకుడు బొర్రు రాము, పలువురు రైతులు సీజేఎఫ్ఎస్ భూ సమస్యను అధికారులకు వివరించారు.

ఎరపంటలతో అధిక దిగుబడులు

విడవలూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వేరుశనగలో అంతర్ పంటలకు (ఎర పంటలు) బంతి, ఆముదం మొక్కలను పెంచుకుంటే దిగు బడులు అధికంగా వస్తాయని వ్యవసాయ శాఖ ఏడీఏ అనిత తెలిపారు. మండలపరిధిలోని రామ చంద్రాపురం, వీరారెడ్డిపాళెం గ్రామాల్లో బుధవారం జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సోలార్ ట్రాప్ బిగించుకుంటే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం వర్తించాలంటే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయాధికారి లక్ష్మి, వీఏఏ వర్షిత, భావన, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం లేక ఇక్కట్లు

● ఆధార్ అప్‌డేట్ కోసం పట్టణాలకు పరుగులు ● వృద్ధులు, చిన్నారుల అవస్థలు

కొండాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ఇతర మండలాలకు, పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో విద్యార్థులు సుమారు 8000 మంది వరకు ఉన్నారు. వీరిలో ఎక్కువమంది విద్యార్థులకు ఆధార్‌లో వివరాలలో కొద్దిపాటి తేడాలున్నాయి. పేర్లు, పుట్టిన తేదీ, జండర్ తదితర విషయాలలో తేడాలుండటం వలన ఆన్‌లైన్లో నమోదు కావడంలో ఇటు విద్యార్థులు అటు పాఠశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు నూతనంగా ఆధార్ కార్డు తీయించుకునేవారు, పెద్దలు, రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో లబ్ధి పొందేందుకు తమ ఆధార్‌లో కొంత సమాచారాన్ని అప్‌డేట్ చేయించాల్సి ఉంటుంది. వీరందరూ 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న కావలి, కందుకూరు పట్టణాలకు వెళ్లి గంటలు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి సర్వర్లు పనిచేయక మరుసటిరోజు వెళ్లాల్సి వస్తోంది. దీంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా, మండలంలో గతంలో గుడవళ్లూరు, తూర్పు ఎర్రబల్లి, చింతలదీవి గ్రామాలలోని సచివాల యాలలో ఆధార్ కేంద్రాలు ఉండేవి. వీటిలో ఒక్క ఆధార్ కేంద్రం కూడా ప్రస్తుతం పని చేయడంలేదు. ఇదిలా ఉండగా సాయిపేట, చింతలదీవి సచివాలయాలలో నూతనంగా ఆదార్ కేంద్రం ఏర్పాటుచేసేందుకు సుమారు 3 నెలల క్రితం మెటీరియల్ సచివాలయాలకు చేరింది. అప్పటి నుంచి వాటిని మూలన పడేశారు.

CRIME NEWS

లారీని ఢీకొన్న ప్రైవేటు బస్

● బస్సు డ్రైవర్ దుర్మరణం



రాజు మృతదేహం

కావలి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని వెనుక వైపు నుంచి ట్రావెల్స్ బస్ ఢీకొనడంతో ట్రావెల్స్ బస్ డ్రైవర్ మృతిచెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి సర్వాయపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం ఏలూరు నుంచి ప్రయాణికులతో బెంగళూరుకు వెళ్తున్న చలసాని ట్రావెల్స్‌బస్ మార్గమధ్యంలోని సర్వాయపాలెం క్రాస్ రోడ్డు సమీపంలో ముందువెళ్తున్న లారీ ఒక్కసారిగా వేగం తగ్గించటంతో బస్ అదుపుతప్పి లారీని వెనుకవైపు ఢీకొంది. ప్రమాదం జరిగిన వెంటనే హైవే మొబైల్ పోలీసులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ రాజేశ్వరరావు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలతో బస్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ కోదాటి రాజు (47)ను 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా, ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్‌లతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించినట్లు సిఐ తెలిపారు. మృతుని భార్య సంధ్య ఫిర్యాదు మేరకు సిఐ రాజేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని టోల్ బూత్ ధ్వంసం



ప్రమాదంలో ధ్వంసమైన టోల్‌బూత్

మర్రిపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో డీసీపల్లి టోల్‌గేట్ బూత్ ధ్వంసం అయిన సంఘటన గురువారం జరిగింది. నెల్లూరు నుంచి కడప వైపు లారీ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో బూత్‌లో ఎవరూ లేనందున ప్రమాదం తప్పింది. టోల్ ప్లాజా వద్ద వాహనాలు వెళ్లేందుకు దారి ఇరుకుగా ఉండటంతో తరచుగా ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటు న్నాయని, నిర్వహణ సక్రమంగా లేదంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలగమూడి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన లక్ష్మయ్య మోటారు బైక్‌పై సర్వేపల్లి నుంచి నెల్లూరుకు వెళ్తుండగా గొలగమూడి సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన లక్ష్మయ్యను ప్రైవేటు క్లినిక్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

కావలి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం గౌరవరం సమీపంలో గురువారం స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొన్న ప్రమాదంలో బేల్దారి కూలి మణికే ఉదయ్ (24) అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం చెన్నుపాడు గ్రామానికి చెందిన ఉదయ్, మహేష్‌లు నెల రోజుల క్రితం తిరుపతి జిల్లా నాయుడుపేటకు బేల్దారి పనులకు వెళ్లారు. కాగా, మహేష్ చెల్లికి పెళ్లి కుదరటంతో ఇరువురూ సోదరులు స్వగ్రామానికి వెళ్లేందుకు స్కూటీపై నాయుడుపేట నుంచి బయలుదేరారు. మార్గమధ్యంలోని గౌరవరం సమీపంలో ఉన్న అటవీశాఖ మొక్కల పెంపక కేంద్రం వద్ద జాతీయ రహదారిపై స్కూటీని వెనుక వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న మహేష్ స్వల్పగాయాలతో బయటపడగా స్కూటీ వెనుక కూర్చుని ఉన్న ఉదయ్ పైకి లారీ టైరు ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలతో ఉన్న మహేష్‌ను 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ఉదయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

● పొంచి ఉన్న ప్రమాదం

ఉదయగిరి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండడంతో పాటు ఫ్యూజు క్యారియర్లు కూడా లేకపోవడంతో తీగలు కిందకు వేలాడుతున్నాయి. దీంతో ఏక్షణంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని అటుగా ప్రయాణాలు సాగించే వాహనదారులు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దిమ్మెలు సైతం నెర్రలు బారి శిథిలావస్థకు చేరినప్పటికీ పట్టించుకొనే నాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదకర మలుపులు ఉన్న ప్రాంతంలో ఎదురుపడిన వాహనాలను తప్పించే క్రమంలో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ముందుకు సాగాల్సిన దుస్థితి నెలకొందని, రాత్రి సమయాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందని వాపోతున్నారు. అంతేగాక మేత కోసం సమీప పొలాలకు వెళ్లిన గేదెలు, మూగజీవాలు ప్రమాదాల బారిన పడే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	121
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 475

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కళా నీరాజనం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పురమందిరంలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కళానీరాజనం వేడుక ఘనంగా జరిగింది. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా కెమెస్ట్ డ్రగ్గిస్ట్ అసోసి యేషన్ అధ్యక్షుడు ప్రదీప్‌లు పాల్గొని కూటమి ప్రభుత్వంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందన్నారు. ఆయనకు కళా నీరాజనం కార్యక్రమం నిర్వహించిన కేతా సుబ్బారావును అభినందించారు. ఈ సందర్భంగా నృత్యాలు, పాటలు పోటీలు జరిగాయి. డేగల సాంబశివరావు శిష్య బృందం ఆధ్వర్యంలో జరిగిన నృత్య విభావరి అలరించింది. దుర్గం మధుసూదన్, కళారాణిల ఆధ్వర్యంలో స్వరనీరాజనం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం

- భక్తులతో ఆలయం కిటకిట
- అన్నప్రసాద వితరణ
- జగన్ రాకతో భక్తుల ఇబ్బందులు



విమాన కలశంకు పూజలు చేస్తున్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో గురువారం దేవస్థానం, విమాన గోపురం, జీవ ధ్వజ, నవగ్రహ మండపం పునఃప్రతిష్ఠ మహాకుంభాభిషేకం మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవానికి దాతలుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, ఆల్తూరు సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, లత, ఆల్తూరు మహేష్‌రెడ్డి, రాధిక దంపతులు, నవగ్రహ మండపం నిర్మాణ దాతలు సుబ్రహ్మణ్యం నరసింహారావులు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో పూజలు వైభవంగా జరిగాయి. మహాకుంభాభిషేకం పూజలు 4 రోజులుగా కంచి పీఠం ఆస్థాన సిద్ధాంతి ఎల్.విజయసుబ్రహ్మణ్యం సిద్ధాంతి శిష్య బృందం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఉద యం మహాగణాధిపతి పూజ, యాగశాల ప్రదక్షణం, మండపాధిష్ఠత, దేవ తాపూజ, అవాహిత దేవతా అవరణ, దేవతా హవనములు, అధివాస హవనం, వేద పారాయణం గర్తన్యాసం, రత్నబీజధాతున్యాసం, సింహ లగ్నంలో దేవతా యంత్ర స్థాపనలు నవగ్రహ, జీవధ్వజ స్తంభం, విమాన గోపురం, కలశ ప్రతిష్ఠ, అష్టబంధనం కళాన్యాసములు జరిగాయి. అనం తరం మహాకుంభాభిషేకం, మూర్తులకు జీవకళాన్యాసం, మహాబలి, నేత్రాన్మీలనం, కుంభ నివేదనం అమ్మవారి దివ్య దర్శనం, మహాపూర్ణాహుతి, బ్రహ్మాఆచార్యపూజ, యజ్ఞ బస్మధారణ, అగ్ని ప్రదక్షణలు, శిఖరంపై బూరె లు పోయుట, అవబృధం, కంకణ విమోచనం, యాగనిర్వహణ, దంపతు లకు నూతన వస్త్ర సమర్పణ, మహాదాశీర్వచనం, పండిత సత్కారం, మహా అన్నసమారాధనలు జరిగాయి. భక్తులతో ఆలయం పోటెత్తింది. కాగా మహాకుంభాభిషేక మహోత్సవంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నవారు. అనంతరం యాగం లో పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ శిఖరంపైకి ఎక్కి కుంభాభిషేకం జరిగే ప్రాంతాన్ని దర్శించుకున్నారు. నూతనంగా నిర్మించిన నవగ్రహ మండపాన్ని పరిశీలించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతున్న సీఎం చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్‌లకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చెక్కా అహల్య, చెక్కా సాయిసునీల్, శివయ్యనాయుడు, జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి, వివిధ దేవాలయాల ఈవోలు, సిబ్బంది, ఆలయ ప్రధాన అర్చకులు ఎస్.రఘురామశర్మ, వేద పండితులు రామకృష్ణమాచార్యులు, రవిశర్మ పాల్గొన్నారు.



విమాన కలశానికి మహాసంప్రోక్షణ చేస్తున్న కంచిపీఠం ఆస్థాన సిద్ధాంతి విజయసుబ్రహ్మణ్యం సిద్ధాంతి, తదితరులు

● ఇబ్బందులకు గురైన భక్తులు

మాజీ ముఖ్యమంత్రి జగన్ నగర పర్యటన సందర్భంగా పోలీసు యంత్రాంగం, నగరం ట్రాఫిక్ మళ్లింపుతోపాటు అష్టదిగ్బంధనం చేయడంతో రాజరాజేశ్వరి ఆలయంలో గురువారం జరిగే మహాకుంభాభిషేకానికి తరలివచ్చే భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. వాహనాలు దూరంగా వదిలి ఆలయానికి తరలివచ్చారు. ఆలయం వరకు ఆటోలు, బస్సులు అనుమతించకపోవడంతో భక్తులు అసహనానికి గురయ్యారు.

జగన్‌ను దూరం పెట్టండి

- అంతుచూస్తామనే వ్యక్తులు మనకొద్దు
- ప్రజలకు ఎంపీ వేమిరెడ్డి పిలుపు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వీపీఆర్, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిలు

నెల్లూరురూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వస్తే అంతు చూస్తామనే జగన్ లాంటి వ్యక్తులను దూరం పెట్టాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రజలకు పిలుపు నిచ్చారు. గురువారం నెల్లూరు రూరల్లోని బుజబుజనెల్లూరులో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కలిసి రూ.65 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ నెల్లూరుకు వచ్చిన మాజీ సీఎం జగన్ అనవసరమైన విమర్శలు చేశారని దుయ్యబట్టారు. ఆయనతో ఎవరో మాట్లాడించినట్టుగా ఆయన ప్రసంగం సాగిందన్నారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని దివాళ తీసిన జగన్ ఇప్పుడు ప్రజల కోసం మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బటన్ నొక్కడం, బంగ్లాలో కూర్చోవడంతోనే ఐదేళ్లు నరిపెట్టేశారని విమర్శించారు. అధికారం కోల్పోయిన ఫ్రెస్టేషన్ స్పష్టంగా కనిపిస్తుందని ఆరోపించారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రూరల్లో వెనుబడిన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. 1,2,12,24,25,30,31 డివిజన్లుకు ప్రత్యేక దృష్టితో నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ బద్దేపూడి నరసింహగిరి, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, నరేష్, శేషయాదవ్‌లు పాల్గొన్నారు.

రేపు ఆట్యా పాట్యా జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆట్యాపాట్యా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీనగర్ ఎంఎస్ఎం స్కూల్‌లో ఈనెల 2వ తేదీ సాయంత్రం 3 గంటలకు జిల్లా బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కే.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 2008 జనవరి 1వ తేదీ తరువాత జన్మించి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వయస్సు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌తో హాజరు కావాలని తెలిపారు.


శ్రావణ శుక్రవారం పూజలకు ఏర్పాట్లు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలకు ఘనంగా ఏర్పాట్లు చేపట్టారు. రాజరాజేశ్వరి ఆలయంలో ఉదయం 9.30 గంటలకు లక్ష కుంకుమార్చన, రాత్రి పల్లకీసేవ, స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం 9 గంటలకు నవబాల దుర్గ కుంకుమార్చన, పూలంగిసేవ, రాత్రి పసుపు కుంకుమలు పంపిణీ, ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో సాయంత్రం మూలవర్లుకు చందనాలంకారం, పూలంగిసేవ, రాత్రి పల్లకీసేవ నిర్వహించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(జడ్పీ), జూలై 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని సరస్వతీ నగర్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సరస్వతీనగర్, రామ్‌నగర్, ఓల్డ్ మిలిటరీ కాలనీ, క్రాంతినగర్, టెక్కేమిట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు.

మూలస్థానేశ్వరుడి ఆలయానికి రూ.98 వేల విరాళం



చెక్కు అందజేస్తున్న అరణి కందప్ప మేస్త్రి సత్రం ఈవో శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 31(ఆంధ్ర జ్యోతి): నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వర ఆలయానికి సబం ధించిన రూ.98 వేల చెక్కును గురువారం అరణి కందప్ప మేస్త్రీ సత్రం ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఆలయ సిబ్బందికి అందజేశారు. అరణి కందప్ప మేస్త్రి సత్రం వ్యవస్థాపకుడు అరణి కందప్ప వీలునామా ప్రకారం మూలస్థానేశ్వర స్వామి, భువనేశ్వరిలకు ప్రతిరోజు రాత్రి శయన పాన్పు పూజలు, పూలమాల కోసం ఏడాదికి రూ.98 వేలు విరాళం అందజేయాలని ఉంది. దాని ప్రకారం ఈ ఏడాదికి సంబంధించిన చెక్కును అందజేశారు.

గణేష్ సేవా మిత్రమండలి వార్షికోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 31(ఆంధ్రజ్యోతి): గణేష్ సేవా మిత్ర మండలి 20వ వార్షికోత్సవం వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగరంలోని జ్యోతి వినాయక స్వామి ఆలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి వృద్ధులకు పండ్లు, యాచకులకు దుస్తులు, బాటసారులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గాలి శ్రీధర్ మాట్లాడుతూ 20 వార్షికోత్సవ వేడుకలు ఐదు రోజు నిర్వహిస్తు న్నామని, ముగ్గురికి వైద్య రంగంలో తాళ్లూరు సువర్ణకుమారి, విద్యారంగంలో పులి సుమాన్, సేవారంగంలో దేవిరెడ్డి సురేష్‌రెడ్డి అవార్డులను అందిస్తున్నామన్నారు. ఆదివారం సేవా బ్లడ్ బ్యాంక్ నందు రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవూరు ప్రసాద్, పరంధామయ్య, సాయికార్తీక్, అనంతశర్మ, గణేష్ సేవామిత్ర మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన మందిరంలో ప్రతిష్ఠించిన సాయిబాబా విగ్రహం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని నవాబుపేట నజీర్‌తోట వద్ద నూతనంగా నిర్మించిన సాయిబాబా మందిరంలో బాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. దేవస్థానం గౌరవాధ్యక్షుడు షేగు షణ్ముఖరావు, సభ్యులు ఆధ్వర్యంలో మూడు రోజులుపాటు వివిధ పూజలు జరిగాయి. ప్రముఖ అర్చకులు మాచవోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉదయం కలశ పూజలు, కలశాభిషేకాలు, సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అలాగే సాయిబాబాకు అభిషేకాలు, హోమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం మహాకుంభాభిషేకం, దేవతలకు కళాన్యాసం నిర్వహించారు. భక్తులకు మహా అన్నప్రసాద వితరణలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు పత్తి జయరామ్, జనరల్ కార్యదర్శి షేగు మహేంద్రకుమార్, జాయింట్ సెక్రటరీ ముంగమూరు చైతన్యకృష్ణ, కోశాధికారి కండే విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మాదరాజుగూడూరులో రెవెన్యూ సదస్సు

నెల్లూరురూరల్, జూలై 31,(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదరాజు గూడూరులో డీటీ నాజర్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ విజయ కుమార్, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిలు మాట్లాడారు. ప్రజలు, రైతులు ఈ రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్ని రెవెన్యూ పరమైన సమస్యలకు పరిష్కారాలు పొందాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ వీటిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ గున్నయ్య పాల్గొన్నారు.

'స్మార్ట్ స్ట్రీట్'ను అందుబాటులోకి తీసుకురండి

● ఎన్ఎంసీ కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), జూలై 31,(ఆంధ్రజ్యోతి) : గుర్తింపు పొందిన వీధి వ్యాపారులకు స్మార్ట్ స్ట్రీట్ బజారును త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. గురువారం మైపాడు రోడ్డు వద్ద జాఫర్‌సాహెబ్ కాలువపై రూపుదిద్దుకుంటున్న దుకాణాల సముదాయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ను రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖలు, విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం తన కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగులు ఎస్‌కే ఖాసీం, ఏవీ సుబ్బారావులు పీ4లో భాగంగా చెరో మూడు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి ఆర్థిక స్థితి మెరుగుపరిచేందుకు ముందుకు రావడంతో వారికి కుటుంబాలను కేటాయించారు. అలాగే నగరంలోని మద్రాసు బస్టాండ్ సమీపంలో ఉన్న గుర్రం జాషువా గ్రంథాలయం వీధికి పద్మభూషణ్ గుర్రం జాషువా గ్రంథాలయం స్ట్రీట్‌గా నామకరణం చేస్తూ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయడం హర్షనీయమని ఎన్ఎంసీ కమిషనర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ పాల్గొన్నారు.

● అనధికార కుళాయిలను గుర్తించండి

నగరంలో అనధికారికంగా ఉన్న కుళాయిలను గుర్తించి వాటిని పన్ను పరిధిలోకి తీసుకురావాలని కమిషనర్ నందన్ సూచించారు. సచివాలయాల ఉద్యోగులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇంటింటా సర్వే నిర్వహించి ప్రతి ఇంటికి కుళాయి ఉండాలని, అది పన్ను పరిధిలోకి రావాలన్నారు. పన్ను చెల్లించని కుళాయిలకు నోటీసులు జారీ చేయాలన్నారు. మొండి బకాయిదారులకు కోర్టు నుంచి సమన్లు జారీ చేయాలని సూచించారు. సచివాలయాల పరిధిలోని తాగునీటి వ్యవస్థపై నిఘా ఉంచి పైపులు డ్యామేజీ, లీకేజీలు, తదుపరి చర్యలపై నివేదికలు సమర్పించాలన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

డెంగ్యూపై అవగాహన ఉండాలి

● మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ



డెంగ్యూపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న జిల్లా అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు(వైద్యం), జూలై 31(ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ సూచించారు. గురువారం డెంగ్యూ మాసోత్సవాల ముగింపు సందర్భంగా కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డెంగ్యూపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వేసవికాలం తర్వాత రుతుపవనాలు వలన వస్తున్న వర్షాలకు వాడిపడేసిన టైర్లు, కొబ్బరి బొండాలు, పగిలిన కుండలు, గుంటల్లో నీరుచేరి డెంగ్యూ కారక దోమలు ఏడిస్ దోమ సంతానోత్పత్తిని పెంచుకుంటాయన్నారు. ఈ నేపథ్యంలో నివాసాల్లో ఇలాంటి నీరు లేకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల కుట్టకుండా దోమ తెరలు, మస్కిటో కాయిన్స్ వాడాలని తెలిపారు. వేపాకు పొగ సాయంత్రం వేళల్లో ఇంటి వద్ద వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ప్రభావతి. ఉపాధ్యాయులు, మలేరియా, ఫైలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైపులు మురుగులో.. గరళం గొంతులో..

- తరచూ లీకేజీలు
- కలుషితమవుతున్న నీరు

ఉదయగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నీటి పైపులు విషాన్ని తీసుకొస్తున్నాయి. దీంతో ప్రజల గొంతులోకి గరళం దిగుతోంది. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన పైపులైన్లతోనే నేటికీ నీటి సరఫరా జరుగుతోంది. పైపులైన్లు మురుగు కాలువల్లో ఉండడం, తరచూ లీకేజీలకు గురవు తుండడంతో దీని ద్వారా వచ్చే నీటిలో నలకలు, దుర్వాసన వస్తున్నాయని ప్రజలు వాపోతు న్నారు. మేజర్ పంచాయతీ అయిన ఉదయగిరి పట్టణంలో 16 వార్డులు, సుమారు 4 వేల నివాసాలు, 17 వేల మంది జనాభా ఉన్నారు. ప్రధానంగా అగ్రహారంవీధి, కోళ్లవీధి, చిన్న మసీదు, కరీమావీధి, షామీర్షావీధి, యూని యన్‌రోడ్డు, సినిమాహాలు సెంటర్ తదితర ప్రాంతాల్లో నీటి పైపులన్నీ మురుగు కాలువల దగ్గరలో ఏర్పాటు చేసి ఉన్నారు. పాతకాలపు పైపులు కావడం, మరమ్మతులకు గురవుతుం డడంతో నీరు కలుషితమవుతోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. నీటి విడుదల సమ యంలో నివాసాలకు వచ్చే నీరు కంటే లీకేజీల రూపేణా అధికంగా నీరు వృథాగా కావడం, మట్టి, ఇతరత్రా పదార్థాలు నీటిలో కలుషితమై నీరు సరఫరా అవుతోంది. దీంతో కొందరు బిందెలకు జల్లెడ, వస్త్రం ఏర్పాటు చేసి వడపోత ద్వారా నీరు పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువల్లో పైపులు లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు లీకేజీలను నివారించి నీరు కలుషితం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



చిన్నమసీదు వద్ద ఉన్న మురుగు కాలువల్లో నీటి పైపులు

కిసాన్ డ్రోన్‌లు సద్వినియోగం చేసుకోవాలి

● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



రైతులకు డ్రోన్ అందిస్తున్న మంత్రి ఆనం

ఏఎస్ పేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైతు సంఘా లకు సబ్సిడీపై అందచేస్తున్న కిసాన్ డ్రోన్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దేవదాయ ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు. గురువారం ఆయన ఏఎస్‌పేట మండలం చిన్నహబీపురం గ్రామానికి విచ్చేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ ఖర్చులు తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్‌లను అందిస్తోందని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గానికి 10 డ్రోన్‌లు మంజూరయ్యా యని, ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడి డ్రోన్‌ను తీసుకోవచ్చని తెలిపారు. మార్కెట్ విలువ రూ. 10లక్షల వరకు ఉంటే రైతుసంఘం కేవలం రూ. 2లక్షలు చెల్లిస్తే మిగిలిన 8లక్షలు వ్యవసాయశాఖ సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో 10 డ్రోన్‌లకు 6 మాత్రమే ఇచ్చామని ఇంకా 4 డ్రోన్‌ల తీసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం పందిపాడు గ్రామ రైతు సంఘం కన్వీనర్ వీరాస్వామి, కోకన్వీనర్ రవీంద్రరెడ్డిలు గ్రూపు సభ్యులకు కిసాన్ డ్రోన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో డిఏవో పుట్టా సత్యవాణి, ఏడీఏలు నర్సోజీ రావు, శైలజ, ఏవో సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

ఏఎస్‌పేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని చిన్నహబీపురం గ్రామంలో నూత నంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో గురువారం విగ్రహాల ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవదాయ, ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు సీతారామం జనేయస్వామి విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కుంభాభిషేకం చేశారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నూతన వితంతు పింఛన్లు మంజూరు చేస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గిరినాయుడు, మండల కన్వీనర్ అబ్బూరి రమేష్‌నాయుడు, నాయకులు కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కాటంరెడ్డి నరసింహ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, షేక్ జిలానిబాషా, సయ్యద్ కాలేషా, హజరత్తయ్య, డా ఖాజామియ్య, మాధ వరెడ్డి, మాల్యాద్రినాయుడు, అల్లంపాటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): డీసీ పల్లి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 488 బేళ్లను తీసుకొని రాగా 18 కం పెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 251 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 237 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 159 పలికి నట్లు వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ తెలిపారు.

ఆధిపత్య పోరు

(5వ పేజీ తరువాయి)

మంచిదని సీనియర్ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

● అసమానతలు తొలగించాలి...

గ్రేడ్-2 హెచ్ఎంలను కన్వర్షన్ ద్వారా ఎంఈవోలుగా నియమించగా, గత వైసీపీ ప్రభుత్వం వివక్ష కారణంగా ఎంఈవో-1ను డీడీవోగా, ఎంఈవో-2ను నాన్ డీడీవోలుగా విభజించి, సమానహోదాను దూరం చేసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఇద్దరు ఎంఈవోల వ్యవస్థ మధ్య అసమానతలు సృష్టించిందని, దీంతో ప్రజల్లో ఎంఈవో-2 అంటే చులకనభావం నెలకొందని మండలస్థాయి అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ వ్యవస్థలో కూడా ఇద్దరు అధికారుల పర్యవేక్షణ లేదని, ఆయన పేర్కొన్నారు. అధికశాతం మంది ఎంఈవోలు దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో తిష్టవేయడంతోపాటు విద్యాశాఖలో ఎంతో కీలకమైన ఎంఈవో-1 పోస్టులకు సంబంధించి అందరూ కూడా అన్నీ వసతులు కలిగి, నగరానికి సమీపంలో ఉన్న మండలాలు, రోడ్డు సర్వీస్ ఉన్న మండలాల్లో మాత్రమే రెగ్యులర్‌గా పనిచేస్తున్నారని టీచర్లు ఆరోపిస్తున్నారు. జిల్లాకు సుదూర ప్రాంతాలు, వసతులు లేనిచోట మాత్రం ఎవరూ సుముఖత చూపకపోవడంతో 20 మండలాల్లో ఇన్‌చార్జి ఎంఈవో-1లతో నెట్టుకురావాల్సి వస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం శాఖాపరమైన సమీక్ష, మరోరోజు ఉన్నతాధికారుల సమీక్ష, వీటికితోడు ప్రజాప్రతినిధుల కార్యక్రమాల్లో ప్రొటోకాల్ హాజరు తదితర కార్యక్రమాలతోనే తమకు సమయం సరిపోతున్నదని ఎంఈవో ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటిపై సమీక్ష చేసి ఏకీకృత విధానంతో సమస్యను పరిష్కరించాలని అత్యధికశాతం మంది ఎంఈవోలు కోరుతున్నారు.


కృష్ణారెడ్డిపల్లిలో ఆందోళన చేస్తున్న మహిళలు

బెల్టుషాపులు నివారించాలని ఆందోళన

ఉదయగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విచ్చలవిడిగా వెలసిన మద్యం బెల్టుషాపులను నివారించాలని గురువారం మండలంలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేశారు. తొలుత గ్రామంలో ఉదయగిరి ప్రాంతీయ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథులుగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివమ్మ, మస్తాన్‌బీ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో వీధికో అనధికారిక మద్యం షాపు ఏర్పాటు చేయడంతో వివాదాలు చెలరేగుతున్నాయన్నారు. మద్యం బెల్టు దుకాణాలను నివారించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో అటువైపు కన్నెత్తి చూడడంలేదని మండి పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు మద్యం బెల్టు దుకాణాలను నివారించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.కామాక్షమ్మ, కాకు విజయమ్మ, ఉపాధ్యక్షురాలిగా ఈ.సుజాత, సహాయ కార్యదర్శిగా షేక్ నయూంతో పాటు సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం చేస్తాం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 31 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ అన్నారు. గురువారం గొల్లపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 5లోని 102 ఎకరాలను సుమారు 40 మంది రైతులకు 2001లో పంపిణీ చేశారు. కాని హద్దులు చూపక పోవడంతో గ్రామంతో పాటు సమీప యర్రంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు ఎవరికి వారు భూములు సాగు చేసుకుంటున్నారు. దీంతో తమ అసలైన భూములు ఎక్కడో తెలియక ఇరు గ్రామాల నడుమ వివాదాలు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది రైతుల అభ్యర్థన మేరకు సబ్ కలెక్టర్ భూములను పరిశీలించి రైతులతో చర్చించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులు సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు హేమంత్ కుమార్, ఆర్ఐ హర్షద్ అహమ్మద్, వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రీపూజ



చేతిపంపు బాగుచేయండి సారూ..

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం ఆత్మారామస్వామి ఆలయం గేటు వెలుపల భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చేతిపంపు మరమ్మతులకు గురైంది. గత మూడు నెలల కిందట చేతిపంపు మరమ్మతులకు గురైనా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చేతిపంపును బాగు చేయాలని భక్తులు కోరుతున్నారు.

విశిష్టమైనవి

నేటి నుంచి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

తల్లిపాలు!

- బిడ్డకు అవే ప్రాణాధారం • గుండె, క్యాన్సర్ జబ్బుల నివారణకు దోహదం
- అవగాహన కల్పించడంలో వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల నిర్లక్ష్యం



నెల్లూరు(వైద్యం), జూలై 31(ఆంధ్రజ్యోతి) : నవ మాసాలు మోసి కన్న బిడ్డను పెంచడంలో తల్లిపాత్ర కీలకమైనది. అంతే విశిష్టత కలిగినవి తల్లిపాలు. బిడ్డకు తల్లిపాలు పట్టిస్తే మహత్తర శక్తి వచ్చి ప్రాణాధారంగా మారుతాయి. గుండె, కేన్సర్ వంటి జబ్బుల నివారణకు దోహదపడుతాయి. అయితే దీనిపై అవగాహన కల్పించేందుకు అటు వైద్య ఆరోగ్యశాఖ, ఇటు ఐసీడీఎస్ తగిన ప్రచారం చెయ్యడం లేదన్నది వాస్తవం. మాతృత్వానికి చిరునామాగా తల్లీబిడ్డలనే ఆదర్శంగా తీసుకుంటారు. పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు ఎంతో ముఖ్యం. ఈ పాలు పలు వ్యాధుల నివారణకు పనిచేస్తాయని నిపుణులు అంటున్నారు. అయితే నేటి తల్లులు ఎంత వరకు ఆ పాలను బిడ్డకు పట్టిస్తున్నారో అన్న సందేహం లేకపోలేదు. అందం చెడిపోతుందని ఎందరో తల్లులు పాలు ఇవ్వడం లేదు. ఇందులో వాస్తవం లేదని అందానికి ఎలాంటి ఢోకా లేదని వైద్య నిపుణులు చెబుతున్నా డబ్బా పాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనివల్ల పిల్లల ఎదుగుదలతో పాటు వారి మానసిక పరివర్తనలోనూ అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. చిన్నారుల్లో రోగ నిరోధకశక్తితో పాటు ఎదుగుదలకు కావాల్సిన పోషకాలు, విటమిన్లు అన్ని తల్లిపాలలో ఉన్నాయి. పుట్టిన చిన్నారికి అమృతంగా భావించే ముర్రిపాలు మానసిక ఎదుగుదలకు, మెదడు చురుగ్గా పని చేసేందుకు తోడ్పడుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఎన్నో రకాల పాల ఉత్పత్తులు వచ్చినప్పటికీ తల్లిపాలకు మించిన పౌష్టికాహారం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం తల్లిపాల ప్రాధాన్యత గురించి చెబుతూ ఎన్నో మార్గదర్శకాలను విడుదల చేసింది. తప్పనిసరిగా పుట్టిన బిడ్డకు ముర్రిపాలతో పాటు 6 నెలల వరకు తల్లిపాలనే ఇవ్వాలని స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఇదే ప్రచారం చేస్తోంది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇది అమలు కావటం లేదు. భారతీయ సంప్రదాయం లోనూ తల్లి పాలు ప్రాధాన్యత ఉంది. ఈ నేపధ్యంలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలని ఐక్య రాజ్య సమితి సైతం వెల్లడించింది.

పాలిచ్చే తల్లులకు ఎంతో మేలు

- బిడ్డలకు పాలిచ్చే తల్లులకు రొమ్ము క్యాన్సర్ ప్రమాదస్థాయిని తగ్గిస్తుంది.
- గర్భాశయం, అండాశయంలో క్యాన్సర్ నిరోధిస్తుంది. కణజాలంలో ఈస్ట్రోజన్ తక్కువగా ఉత్పత్తి కావడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుంది.
- ముర్రుపాలు బిడ్డ తాపించడం వల్ల తల్లి, బిడ్డకు ఎముకల వ్యాధి నియంత్రణకు దోహదపడతాయి.
- భావోద్వేగాలు అరికడుతోంది.

● జిల్లాలో ప్రచారం ఏది?

జిల్లాలో తల్లిపాలపై తగిన ప్రచారం సన్నగిల్లుతోంది. జిల్లా వ్యాప్తంగా తల్లిపాల విశిష్టతను తెలిపే అవగాహన సదస్సులను వైద్య ఆరోగ్యశాఖతో పాటు, స్త్రీ, శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా నిర్వహించాలి. జిల్లా వ్యాప్తంగా 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిద్వారా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలి. పీహెచ్‌సీలలోనూ గర్భిణులకు తల్లిపాలు ప్రాధాన్యత తెలియచేయాలి. అయితే ఆ మేరకు కార్యక్రమాలు నిర్వహించడంలో చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తల్లిపాల విశిష్టతపై ప్రభుత్వం కరపత్రాల రూపంలో వైద్యశాఖకు వచ్చేవి. అయితే వాటి ఊసే లేదు. అలాగే తల్లిపాల వారోత్సవాలపై మార్గదర్శకాలను వారంలోపే ఐసీడీఎస్‌కు చేరాల్సి ఉన్నా నేటికీ ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీనివల్ల తల్లిపాల వారోత్సవాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం కూడా ఉందని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు మిగిలిన ప్రాంతాల్లో కూడా విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తే చిన్నారుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినట్లే.

చిన్నారులకు ఉపయోగాలు..

- నవజాత శిశువు జన్మించిన తరువాత తల్లికి వచ్చే ముర్రుపాలు బిడ్డకు తాగించాలి.
- ఇందులో ఎన్నో పోషకాలు, విటమిన్లు ఉంటాయి.
- పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు శ్రేష్టమైనవి.
- చిన్నారుల్లో రోగ నిరోదక శక్తిని పెంచే గుణం ఉంది.
- ఊబకాయం కూడా నిరోధించడమే కాకుండా మెదడు చురుకుగా పని చేసేలా ఆరోగ్య ప్రధాయినిలా నిలుసాయి.

తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు



పుట్టిన బిడ్డకు ఎన్నో పోషకాలు ఉన్న తల్లి ముర్రుపాలు ఇవ్వడం వల్ల ఎంతో మేలు జరుగుతోంది. తల్లిదండ్రులతోపాటు ప్రతి ఒక్కరు తల్లిపాల విశిష్టతను గుర్తించాలి. గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీలకు వచ్చే తల్లులకు తల్లిపాల విశిష్టతను ముందుగానే తెలియచేస్తున్నారు. తల్లిపాల వారోత్సవాలు విజయవంతం చేసేలా కృషి చేస్తాం. పీహెచ్‌సీల పరిధిలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాలపై అవగాహన కల్పిస్తారు.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

● ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్

నెల్లూరు(హరనాథపురం), జూలై 31(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ చెప్పారు. నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ వారోత్సవాల ప్రారంభం రోజున వైద్యశాలలు, మాల్స్, దేవాలయాలు, బస్‌స్టాండ్‌లు తదితర చోట్ల బ్రెస్ట్ ఫీడింగ్ కార్నర్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏపీడీ అనురాధ, అర్బన్ సీడీపీవో టీ.అరుణ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ ఉద్యోగులకు పదోన్నతి

● కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత


నియామకపు ఉత్తర్వులను అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో మోహన్‌రావు

నెల్లూరు(జడ్పీ), జూలై 31(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పలువురు ఉద్యోగులకు పదోన్నతి, కారుణ్య నియామకపు ఉత్తర్వులను జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీ సీఈవో జే.మోహన్‌రావు అందజేశారు. జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం పరిధిలో ఒక సీనియర్ సహాయకురాలికి పరిపాలనాధికారిగా, ఆరుగురు జూనియర్ సహాయకులు, టైపిస్టులకు సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పించారు. వీరితోపాటు మరో ఇద్దరికి కారుణ్య నియామకపు ఉత్తర్వులు అందజేశారు. పొదలకూరు మండల ప్రజాపరిషత్ పరిపాలనాధికారిగా బీ.విజయశ్రీ, వెంకటరమణయ్యకు తోటపల్లి గూడూరు, రామకృష్ణకు కొండాపురం, ఇలియాజ్‌కు సీతారామపురం, లీలా మోహనరావుకు నెల్లూరు జడ్పీ, సుదర్శన హారతికి కొడవలూరు, దేవప్రసన్నకుమార్‌కు చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయాల్లో సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు. అలాగే కారుణ్య నియామకాల కింద అనగాని కవితకు కోవూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆఫీస్ సబార్డినేటుగా, గుర్రం రజితకు వరికుంటపాడు మండల ప్రజా పరిషత్ కార్యాల ఆఫీస్ సబార్డినేటుగా నియామకపు ఉత్తర్వులిచ్చారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ 2021 నుంచి ఇప్పటి వరకు వివిధ హోదాలలో 120 మందికి పదోన్నతులు కల్పించామన్నారు. 81 మందికి కారుణ్య నియామకాల ఉత్తర్వులు అందజేశామన్నారు. జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్య పరిధిలో ఎప్పటికప్పుడు పదోన్నతులు, కారుణ్య నియామకాలు త్వరితగతిన ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కార్యాలయ పరిపాలనాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు అధిగమించకపోతే చర్యలు

- జిల్లాకు రెండు వేల గోకులం షెడ్ల మంజూరు
- డ్వామా పీడీ గంగాభవాని వెల్లడి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

ఉదయగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం అధిగమించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని హెచ్చరించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి క్లస్టర్ స్థాయిలో ఏపీవోలు, ఈసీలు, ఎఫ్ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను ఇప్పటివరకు 70 శాతం పూర్తి చేశారని, ఆగస్టు చివరి నాటికి 90 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పంచాయతీలో 100 కంపోస్టు పిట్‌లు ఏర్పాటు చేయాలని, ఈ నిర్మాణాలను ఈనెల 10వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి మండలంలో మూడు పంచాయతీల్లో నూరు శాతం ఇంకుడుగుంతల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పండ్లతోటల పెంపకంలో భాగంగా జిల్లాలో 3,500 ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 1,700 ఎకరాల్లో రైతులను గుర్తించామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 2,000 గోకులం షెడ్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఏపీడీ మృదుల, ఎంపీడీవో అప్పాజీ, ఏపీవోలు, సిబ్బంది తదితులు పాల్గొన్నారు.

జగన్ నీతులు చెప్పడం సిగ్గుచేటు

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విలువలకు అర్థం తెలియని జగన్మోహన్‌రెడ్డి నీతులు మాట్లాడటం సిగ్గుచేటని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. నెల్లూరు పర్యటనలో జగన్మోహన్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని దుయ్యబట్టారు. తాటిపర్తిలోని రుస్తుం మైన్స్‌లో విచ్చలవిడిగా క్వార్ట్జ్ దోపిడీ జరుగుతుంటే తాము రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు అక్కడ ఏమీ జరగలేదు అన్నట్లుగా కాకాణి గోవర్దన్‌రెడ్డి మంచి బాలుడు అన్నట్లుగా జగన్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబును కొట్టే ధైర్యం పెద్దిరెడ్డికి ఉందా అని సోమిరెడ్డి ప్రశ్నించారు. మిథున్‌రెడ్డి జైలుకు వెళ్ల డానికి కారణం కక్ష సాధింపులు కావని, జగన్ ధన దాహమేనని విమర్శించారు. జగన్‌రెడ్డి కనుసైగల్లో జరిగిన లిక్కర్ స్కామ్‌లో 40 మంది నిందితులుగా చేర్చారని, వారిలో ఇప్పటికే 12 మంది జైలుకెళ్లారని గుర్తు చేశారు. ఉచిత ఇసుక గురించి జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఇసుక దోపిడీ చేసినందుకే అప్పటి మైనింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి జైలుకు వెళ్లిన విషయాన్ని జగన్ గుర్తుకు తెచ్చుకోవాలని హితవు పలికారు. నాడు జగన్ బయటకు వస్తుంటే పరదాలు కట్టేవారని, ప్రజలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదన్నారు. కానీ ఇప్పుడు ప్రజాస్వామ్య పాలన జరుగుతోందని, గత పరిస్థితి ఇప్పుడు లేదని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. అధికారుల గురించి మాట్లాడే అర్హత జగన్మోహన్‌రెడ్డికి లేదని, ఆయన కారణంగా అనేక మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జైలుకెళ్లారని గుర్తు చేశారు.

దొంగే.. దొంగ అన్నట్టుంది : కోటంరెడ్డి

దొంగే. దొంగ, దొంగ అన్నట్లుగా ప్రజాస్వామ్యం గురించి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతున్నారని టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం ఆయన నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజాపోరాటాలు చేసిన వారిపై అక్రమ కేసులు, అరెస్టులు చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన సాగిస్తున్నారు కాబట్టే వైసీపీ నాయకులు చేసిన ప్రతీ అవినీతి, అక్రమ వ్యవహారంలో న్యాయబద్ధంగా ముందుకెళుతున్నామని స్పష్టం చేశారు. 'చంద్రబాబు బావిలో దూకాలంటూ జగన్ మాట్లాడుతున్నారు. బావిలో దూకాల్సింది చంద్రబాబు కాదు.. జగన్మోహన్‌రెడ్డే. ఎందుకంటే తన పాలనలో రాష్ట్రాన్ని దివాలా తీయించి భ్రష్టు పట్టించారు. అందుకే ప్రజలు 11 సీట్లతో బుద్ధి చెప్పారు' అని శ్రీధర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో తామం తా చివర వరకూ జగన్ వెంటే ఉంటామని చెప్పామని, కానీ ఆ తర్వాత ఎందుకు దూరమయ్యామో జగన్ గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. జగన్‌కు ఇంగిత జ్ఞానం ఉంటే చంద్రబాబుకు, నెల్లూరు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు

టీడీపీ మద్దతు అభ్యర్థిగా చలంచర్ల కామేశ్వరమ్మ


నామినేషన్ దాఖలు చేస్తున్న చలంచర్ల కామేశ్వరమ్మ

విడవలూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విడవలూరు బిట్ 1 ఎంపీటీసీ ఎన్నికలకు 3 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు బుధవారం తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహ కారంతో టీడీపీ బలపరిచిన చలంచర్ల కామేశ్వ రమ్మ రెండు నామినేషన్లను దాఖలు చేసింది. డమ్మీ అభ్యర్థిగా కానూరు ప్రవల్లిక ఒక సెట్ నామినేషన్‌ని దాఖలు చేసింది. ఈ సంద ర్భంగా ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎంపీటీసీ అభ్యర్థిగా చలంచర్ల కామేశ్వ రమ్మను ఎన్నికల్లో నిలబెడుతున్నామన్నారు. ఎన్నికలు అనివార్యమైతే స్థానిక నాయకు లం దరూ కలసికట్టుగా ఎంపీటీసీ అభ్యర్థి గెలుపున కు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఏటూరు హరిరెడ్డి, టీడీపీ నాయకులు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, సత్యవోలు సత్యం రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, చెముకుల శ్రీనివాసులు, కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, సమాధి శ్రీనివాసులు, మాతూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ. 20 లక్షలు... ఇంటికో ఉద్యోగం

• అభివృద్ధికి కరేడు రైతులు సహకరించాలి • ఎమ్మెల్యే ఇంటూరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో కొత్త పరిశ్రమల రాకతో అభివృద్ధి వేగం పుంజుకుంటోందని, ప్రజలందరికీ మేలుచేసే ఇలాంటి అభివృద్ధిని అందరూ స్వాగతించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు కోసం కరేడు రైతులకు ఎకరానికి రూ. 20 లక్షలు పరిహారంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇప్పించటం జరుగుతుందని, పరిశ్రమ కోసం మొదట్లో 8500 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించినా రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని కేవలం 4800 ఎకరాలు మా త్రమే తీసుకునేందుకు సీఎం చంద్రబాబు అంగీకరిం చారని, ఈనేపథ్యంలో పరిశ్రమ కోసం రైతులంతా సహకరించాలని కోరారు. భూమి ఇచ్చిన ప్రతిరైతు ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు కలెక్టరు అంగీకరించారన్నారు. ఆగస్టు నాటికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. గత ఐదేళ్లలో విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడ్డ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నెల్లూరు ఎందుకు వచ్చారో ప్రజలకు సమాధా నం చెప్పాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కందుకూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 36మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన 21 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు సేవలు అభినందనీయం


వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న అధికారులు

నెల్లూరు(క్రైం), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖలో ఎంత్రపాటి వెంకటేశ్వర్లు సేవలు అభినందనీ యమని ఎక్సైజ్ డీసీ ఎం.శంక రయ్య కొనియాడారు. ఎక్సైజ్ శాఖలో 40 ఏళ్ల సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఇన్ స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఆయన సన్మాన కార్యక్రమం గురువారం ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయనను అధికారులు, సిబ్బంది పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీ దయాసాగర్ రావు, ఈఎస్ శ్రీనివాసులు నాయుడు, అధికారులు రమేష్, జగదీష్‌కుమార్, అసోసియేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మూత పడ్డ పాఠశాల

మధ్యాహ్నానికే పాఠశాల మూత

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 31 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పం చాయతీ పరిధిలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల గురువారం మధ్యాహ్నానికే మూతపడింది. పాఠ శాల ఉపాధ్యాయుడు సెలవులో ఉండడంతో సీఆర్ఎంటీ ప్రసాద్‌కు పాఠశాల బాధ్యతలు అప్పగించారు. ఆయన మధ్యాహ్నం వరకు పాఠశా లలో ఉండి మధ్యాహ్నం నుంచి సమావేశం ఉందని విద్యార్థులకు చెప్పి వెళ్లిపోయారు. దీంతో పాఠశాల మూతపడింది. ఈ విషయంపై ఎంఈవో-1 పద్మనాభరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
6 శుక్రవారం, 1 ఆగస్టు 2025
www.andhrajyothy.com

ఆత్మకూరు
ఉదయగిరి

'ఉపాధి' పనులు వేగవంతం చేయాలి

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : మండలాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలని డ్వామా పీడీ గంగాభవాని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల మర్రిపాడు, సంగం, ఆత్మకూరు మండలాల ఉపాధి పథకం క్షేత్ర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె హార్టికల్చర్ ప్లాంటేషన్, పశువుల తాగునీటి తొట్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీ. రఫీఖాన్, ఏపీడీ ప్రతాప్‌రెడ్డి, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9472
వెండి కిలో ధర	రూ. 114000
వెండి ఒక గ్రాము	రూ. 117.00

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

ఉదయగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఆగస్టు ఒకటి నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సీడీపీవో సునీత తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా తల్లిపాల వారోత్సవ కార్యక్రమాలను నిర్వహించి బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించడంతో పాటు ర్యాలీలు నిర్వహించాలన్నారు. యాప్‌లలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఉన్నతాధికారులు ఉదయగిరి ప్రాజెక్టుకు నూతన సీడీపీవోను నియమించారని, త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షాను, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఈవో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

ఉదయగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి-1గా తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు ఉదయగిరి ఎఫ్ఏసీ ఎంఈవోగా బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో మండలంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 31(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు మండల ఎంఈవో-1గా పద్మనాభరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కావలి మండలం వట్టూరు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు దుత్తలూరు మండలానికి నియమించారు.

సులభ రీతిలో విద్యాబోధన చేయాలి

ఉదయగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవో తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టణంలోని బీసీ కాలనీ ఆదర్శ తెలుగు ప్రాథమిక పాఠశాలను వారు సందర్శించారు. అంతేకాకుండా విద్యార్థుల ప్రగతిని పరిశీలించి తరగతి గదులు విద్యార్థులు ఆకర్షించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపట్టికలను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షమీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి అయూబ్‌అప్సర్ అన్నారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నివాసాల్లో నీటి నిల్వలు ఉంచకుండా చర్యలు చేపట్టడంతో పాటు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్‌వో ఓంకారయ్య, ప్రిన్సిపాల్ సైమన్‌రావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్, పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): డీసీ పల్లి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 488 బేళ్లను తీసుకొని రాగా 18 కం పెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 251 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 237 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 159 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ తెలిపారు.

పైపులు మురుగులో.. గరళం గొంతులో..

● తరచూ లీకేజీలు ● కలుషితమవుతున్న నీరు

ఉదయగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నీటి పైపులు విషాన్ని తీసుకొస్తున్నాయి. దీంతో ప్రజల గొంతులోకి గరళం దిగుతోంది. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన పైపులైన్లతోనే నేటికీ నీటి సరఫరా జరుగుతోంది. పైపులైన్లు మురుగు కాలువల్లో ఉండడం, తరచూ లీకేజీలకు గురవు తుండడంతో దీని ద్వారా వచ్చే నీటిలో నలకలు, దుర్వాసన వస్తున్నాయని ప్రజలు వాపోతు న్నారు. మేజర్ పంచాయతీ అయిన ఉదయగిరి పట్టణంలో 16 వార్డులు, సుమారు 4 వేల నివాసాలు, 17 వేల మంది జనాభా ఉన్నారు. ప్రధానంగా అగ్రహారంవీధి, కోళ్లవీధి, చిన్న మసీదు, కరీమావీధి, షామీర్షావీధి, యూని యన్‌రోడ్డు, సినిమాహాలు సెంటర్ తదితర ప్రాంతాల్లో నీటి పైపులన్నీ మురుగు కాలువల దగ్గరలో ఏర్పాటు చేసి ఉన్నారు. పాతకాలపు పైపులు కావడం, మరమ్మతులకు గురవుతుం డడంతో నీరు కలుషితమవుతోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. నీటి విడుదల సమ యంలో నివాసాలకు వచ్చే నీరు కంటే లీకేజీల రూపేణా అధికంగా నీరు వృథాగా కావడం, మట్టి, ఇతరత్రా పదార్థాలు నీటిలో కలుషితమై నీరు సరఫరా అవుతోంది. దీంతో


చిన్నమసీదు వద్ద మురుగు కాలువలో నీటి పైపులు

కొందరు బిందెలకు జల్లెడ, వస్త్రం ఏర్పాటు చేసి వడపోత ద్వారా నీరు పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువల్లో పైపులు లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు లీకేజీలను నివారించి నీరు కలుషితం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.


వడపోత ద్వారా బిందెకు నీరు


నాగేశ్వరస్వామి ఆలయం వద్ద దేవదాయ శాఖ అధికారులు

నాగేశ్వర స్వామి ఆలయం పరిశీలన

చేజర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్ళపాడు సమీపంలోని నాగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం ఆదేశాలతో గురువారం రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు ఇసుకలో పూడిపోయిన దేవాలయాన్ని పరిశీలించారు. రాష్ట్ర దేవదాయ శాఖ స్థపతి పి పరమేశ్వరప్ప, గుంటూరు డిఈఈ శ్రీనివాసులు, నెల్లూరు ఏఈ పి.సురేంద్ర, సహాయక స్థపతి సురేంద్ర ఇతర అధికారులు పరిశీలించి ఆలయ నిర్మాణానికి సంబంధించి తగిన ప్రతిపాదనలతో నివేదికలను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జయంతులునాయుడు తదితరులు ఉన్నారు.

కిసాన్ డ్రోన్‌లు సద్వినియోగం చేసుకోవాలి

● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


రైతులకు డ్రోన్ అందజేస్తున్న మంత్రి ఆనం

ఏఎస్ పేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైతు సంఘాలకు సబ్సిడీపై అందచేస్తున్న కిసాన్ డ్రోన్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దేవదాయ ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు. గురువారం ఆయన ఏఎస్‌పేట మండలం చిన్నహబీపురం గ్రామానికి విచ్చేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ ఖర్చులు తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్‌లను అందిస్తోందని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గానికి 10 డ్రోన్‌లు మంజూరయ్యాయని, ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడి డ్రోన్‌ను తీసుకోవచ్చని తెలిపారు. మార్కెట్ విలువ రూ. 10లక్షల వరకు ఉంటే రైతుసంఘం కేవలం రూ. 2లక్షలు చెల్లిస్తే మిగిలిన 8లక్షలు వ్యవసాయశాఖ సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో 10 డ్రోన్‌లకు 6 మాత్రమే ఇచ్చామని ఇంకా 4 డ్రోన్‌ల తీసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం పందిపాడు గ్రామ రైతు సంఘం కన్వీనర్ వీరాస్వామి, కోకన్వీనర్ రవీంద్రరెడ్డిలు గ్రూపు సభ్యులకు కిసాన్ డ్రోన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి పుట్టా సత్యవాణి, సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సోజీరావు, శైలజ, మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

● మంత్రి ఆనం పూజలు


ఏఎస్‌పేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహబీపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో గురువారం విగ్రహాల ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వేద పండితులు సీతారామంజనేయస్వామి విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కుంభాభిషేకం చేశారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నూతన వితంతు పింఛన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గిరినాయుడు, మండల కన్వీనర్ అబ్బూరి రమేష్‌నాయుడు, నాయకులు కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కాటంరెడ్డి నరసింహ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, షేక్ జిలానిబాషా, సయ్యద్ కాలేషా, హజరత్తయ్య, డా ఖాజామియ్య, మాధవరెడ్డి, మాల్యాద్రినాయుడు, అల్లంపాటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం


అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి రాఘవేంద్ర

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం ఎస్టీ కాలనీలో గురువారం స్పిర్డ్ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పశువైద్యాధి కారి రాఘవేంద్ర మాట్లాడుతూ పాడి రైతు లు తమ గేదెలు, మూగజీవాల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అలాగే పశుగ్రాసం ప్రాముఖ్యత, రాయితీ పథకాలు తదితర అంశాలను వివరించారు. అనంతరం పలు రకాల వ్యాధుల తో బాధ పడుతున్న గేదెలు, జీవాలను పరిశీ లించి మందులను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో సిబ్బంది కిషోర్, వీరాంజనే యులు, అక్తర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



నెల్లూరు(సాంస్కృతికం), జూలై 31(ఆంధ్ర జ్యోతి): నగరంలోని నవాబుపేట నజీర్‌తోట వద్ద నూతనంగా నిర్మించిన సాయిబాబా మందిరంలో బాబా విగ్రహ ప్రతిష్ఠ మహో త్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. దేవస్థానం గౌరవాధ్యక్షుడు షేగు షణ్ముఖరావు, సభ్యులు ఆధ్వర్యంలో మూడు రోజులుపాటు వివిధ పూజలు జరిగాయి. ప్రముఖ అర్చకులు మాచవోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉదయం కలశ పూజలు, కలశాభిషేకాలు, సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అలాగే సాయిబాబాకు అభిషేకాలు, హోమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం మహాకుంభాభిషేకం, దేవతలకు కళాన్యాసం నిర్వహించారు. భక్తులుకు మహా అన్నప్రసాద వితరణలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు పత్తి జయరామ్, జనరల్ కార్యదర్శి షేగు మహేంద్రకుమార్, జాయింట్ సెక్రటరీ ముంగమూరు చైతన్యకృష్ణ, కోశాధికారి కండే విశ్వనాధ్, తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం


స్కానింగ్ నివేదికలు పరిశీలిస్తున్న బృందం

ఉదయగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్కానింగ్ పరీక్షలు నిర్వహించి ఆడ, మగ అని లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని వైద్యుడు ఠాగూర్ సూచించారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని వేణు నర్సింగ్‌హోమ్‌లో బృంద సభ్యులు తనిఖీ నిర్వహించి స్కానింగ్ కేంద్రాన్ని, నివేదికలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. స్కానింగ్ నిబంధనల ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ కే.వేణుగోపాల్, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ప్రజల సొమ్ము దుర్వినియోగం : సీపీఎం


మాట్లాడుతున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీలో ప్రజల సొమ్ము అభివృద్ధి పనుల పేరిట దుర్వినియోగం అవుతోందని సీపీఎం నేతలు ధ్వజమెత్తారు. గురువారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, సీఐటీయు జిల్లా నాయకులు జి శివ ప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైరన్ షేక్ సందాని, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు గుల్జార్‌బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరుపాళెం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు డివైడర్లలో మొక్కలు నాటడానికి రూ. 45 లక్షలు కేటాయించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. తాము ఆ పనులను పరిశీలించగా అక్కడ మొక్కలు నాటేందుకు కేటాయించిన నిధుల్లో భారీ వ్యత్యాసం ఉందన్నారు. ఇక 14వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయినట్లు తెలుస్తోందన్నారు. ఇప్పటికైన మున్సిపల్ కార్యవర్గం వీటిపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రం తనిఖీ


టైలరింగ్ నమూనాలను పరిశీలిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి

కలువాయి, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాయలం ఆవరణలో నిర్వహిస్తు న్న టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని గురువారం బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ నిర్మలాదేవి తనిఖీ చేశారు. శిక్షణ పొందుతున్న మహిళలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో ఎం భవాని, బీసీ కార్పొరే షన్ సీనియర్ సహాయకులు అలేఖ్య, మండల పరిషత్తు సీనియర్ సహాయకులు రమేష్ ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం


షరీఫ్‌బాషా దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు

ఉదయగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానో పాధ్యాయునిగా పని చేస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేసిన షేక్ షరీఫ్‌బాషాను ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానిం చారు. పలువురు వక్తలు మాట్లాడుతూ 36 ఏళ్లగా ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పని చేసి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందడంతో పాటు ఎందరో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ఆయన శేష జీవితం ఆయురా రోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం


రవీంద్రనాథ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న గ్రంథాలయ ఉద్యోగులు

సంగం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన కలికి రవీంద్రనాథ్‌రెడ్డిని గురువారం గ్రంథాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి దంపతులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రంథాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పాఠకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



లారీని ఢీకొన్న ప్రైవేటు బస్

● బస్సు డ్రైవర్ దుర్మరణం


రాజు మృతదేహం

కావలి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని వెనుక వైపు నుంచి ట్రావెల్స్ బస్ ఢీకొనడంతో ట్రావెల్స్ బస్ డ్రైవర్ మృతిచెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి సర్వాయపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం ఏలూరు నుంచి ప్రయాణికులతో బెంగళూరుకు వెళ్తున్న చలసాని ట్రావెల్స్‌బస్ మార్గమధ్యంలోని సర్వాయపాలెం క్రాస్ రోడ్డు సమీపంలో ముందువెళ్తున్న లారీ ఒక్కసారిగా వేగం తగ్గించటంతో బస్ అదుపుతప్పి లారీని వెనుకవైపు ఢీకొంది. ప్రమాదం జరిగిన వెంటనే హైవే మొబైల్ పోలీసులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ రాజేశ్వరరావు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలతో బస్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ కోదాటి రాజు (47)ను 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా, ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్‌లతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించినట్లు సిఐ తెలిపారు. మృతుని భార్య సంధ్య ఫిర్యాదు మేరకు సిఐ రాజేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని టోల్ బూత్ ధ్వంసం


ప్రమాదంలో ధ్వంసమైన టోల్‌బూత్

మర్రిపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో డీసీపల్లి టోల్‌గేట్ బూత్ ధ్వంసం అయిన సంఘటన గురువారం జరిగింది. నెల్లూరు నుంచి కడప వైపు లారీ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో బూత్‌లో ఎవరూ లేనందున ప్రమాదం తప్పింది. టోల్ ప్లాజా వద్ద వాహనాలు వెళ్లేందుకు దారి ఇరుకుగా ఉండటంతో తరచుగా ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటు న్నాయని, నిర్వహణ సక్రమంగా లేదంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలగమూడి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన లక్ష్మయ్య మోటారు బైక్‌పై సర్వేపల్లి నుంచి నెల్లూరుకు వెళ్తుండగా గొలగమూడి సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన లక్ష్మయ్యను ప్రైవేటు క్లినిక్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

కావలి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం గౌరవరం సమీపంలో గురువారం స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొన్న ప్రమాదంలో బేల్దారి కూలి మణికే ఉదయ్ (24) అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం చెన్నుపాడు గ్రామానికి చెందిన ఉదయ్, మహేష్‌లు నెల రోజుల క్రితం తిరుపతి జిల్లా నాయుడుపేటకు బేల్దారి పనులకు వెళ్లారు. కాగా, మహేష్ చెల్లికి పెళ్లి కుదరటంతో ఇరువురూ సోదరులు స్వగ్రామానికి వెళ్లేందుకు స్కూటీపై నాయుడుపేట నుంచి బయలుదేరారు. మార్గమధ్యంలోని గౌరవరం సమీపంలో ఉన్న అటవీశాఖ మొక్కల పెంపక కేంద్రం వద్ద జాతీయ రహదారిపై స్కూటీని వెనుక వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న మహేష్ స్వల్పగాయాలతో బయటపడగా స్కూటీ వెనుక కూర్చుని ఉన్న ఉదయ్ పైకి లారీ టైరు ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలతో ఉన్న మహేష్‌ను 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ఉదయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

● పొంచి ఉన్న ప్రమాదం

ఉదయగిరి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండడంతో పాటు ఫ్యూజు క్యారియర్లు కూడా లేకపోవడంతో తీగలు కిందకు వేలాడుతున్నాయి. దీంతో ఏక్షణంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని అటుగా ప్రయాణాలు సాగించే వాహనదారులు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దిమ్మెలు సైతం నెర్రలు బారి శిథిలావస్థకు చేరినప్పటికీ పట్టించుకొనే నాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదకర మలుపులు ఉన్న ప్రాంతంలో ఎదురుపడిన వాహనాలను తప్పించే క్రమంలో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ముందుకు సాగాల్సిన దుస్థితి నెలకొందని, రాత్రి సమయాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందని వాపోతున్నారు. అంతేగాక మేత కోసం సమీప పొలాలకు వెళ్లిన గేదెలు, మూగజీవాలు ప్రమాదాల బారిన పడే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	121
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 475

గ్రామ ముఖద్వారం ప్రారంభం

కలిగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి-చుత్తలూరు జాతీయ రహదారి విస్తరణలో పోలంపాడు గ్రామ ముఖద్వారం తొలగించవలసి వచ్చింది. అనంతరం గ్రామస్థులంతా కలిసికట్టుగా నూతనంగా నిర్మించుకున్న ముఖద్వారాన్ని గురువారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ముఖద్వారం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాకర్ల

న్యూస్ బాక్స్

2 నుంచి పాలిసెట్‌కు స్పాట్ అడ్మిషన్లు

కావలి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం రుద్ర కోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆగస్టు 2వ తేదీ నుంచి 5వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ గురు వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పాస్ అయినవారు, ఇంటర్ పాస్/ఫెయిల్, ఐటిఐ పాస్/ఫెయిల్ అయిన వారు, 2025కు అసలు పాలిసెట్‌కు అప్లయ్ చెయ్యనివారు కూడా స్పాట్ అడ్మిషన్లకు అర్హులన్నారు. అభ్యర్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, 4వ నుంచి 10వ తరగతి వరకు చదివిన పాఠశాలల స్టడీ సర్టిఫికేట్లు, పాలిసెట్‌కు దరఖాస్తు చేసి పరీక్ష రాసినవారు హాల్‌టికెట్, అర్హత సాధిం చినా, లేకున్నా ర్యాంక్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తదితర సర్టిఫికెట్లతో పాటు రూ.5800 అడ్మిషన్లకు ప్రవేశ రుసుంతో రావాలన్నారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్సుమెంట్ సదుపాయం లేదన్నారు. తమ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ), సివిల్ ఇంజనీరింగ్ శాఖలు అందుబాటులో ఉన్నాయన్నారు. తదుపరి సమాచారం కోసం సుబ్బన్న హెచ్‌వోడి (ఈఈ ఈ)7981307400, ఎస్ శ్రీనివాస రెడ్డి (సివిల్ ఇంజనీరింగ్) 9440394524 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు పింఛన్ల పంపిణీ

లింగసముద్రం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్లను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఉదయం 9 గంటలకు లింగసముద్రంలో లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని కందుకూరులోని ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈకార్యక్రమానికి అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

అధ్యాపకురాలి మృతికి సంతాపం

కందుకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న షేక్ షహనాజ్‌బేగం గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఆమె మృతిపట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, సహచర అధ్యాపకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

కొండాపురం తహసీల్దార్‌గా సురేష్‌బాబు



తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నేతలు

కొండాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా సురేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు బదిలీపై లింగసముద్రం మండలానికి వెళ్లడంతో బోగోలు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎమ్ సురేష్ బాబు బదిలీపై వచ్చారు. దీంతో కార్యాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఆయనను ప్రత్యేకంగా కలసి అభినందించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబు నాయుడు, పోలినేని రమేష్, దాసరి అశోక్, పి చైతన్య, నరేంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు ఎంఈఓగా ఎంఎన్‌కే శర్మ



కందుకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మండల విద్యాశాఖాధికారిగా ఎం. నాగకుమారశర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని, ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈఓను ఎంఈఓ2 కె. సుబ్బారెడ్డి, కార్యాలయ సిబ్బంది, సీఆర్ ఎంటీలు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సత్కరించారు.

అధ్వానంగా ముసునూరు ట్రంకు రోడ్డు

- గుంతలమయమైన రహదారిపై వాహనదారుల అవస్థలు



గుంతలమయంగా మారిన ముసునూరు ట్రంకు రోడ్డు

కావలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పరిధిలోని ముసునూరు దక్షిణ శివారులో ఉన్న ట్రంకు రోడ్డు కొంత భాగం దెబ్బతిని గుంతలమయంగా మారింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ముసునూరులో ట్రంకు రోడ్డు బాగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే క్రిష్టారెడ్డి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఇంటి ముందు, ముసునూరు ప్రధాన ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్డుకు తారు కోటింగ్ వేయించారు. దీంతో కావలి నుంచి ముసునూరు బైపాస్ వరకు ఒకచోట తప్ప రోడ్డంతా బాగానే ఉంది. అయితే ముసునూరు దక్షిణ ప్రాంతంలో శివారెడ్డి రైస్‌మిల్ సమీపంలో 20 మీటర్ల మేర రోడ్డు దెబ్బతిని ఉంది. ఈవిషయం తెలియని వాహన చోదకులు వేగంగా వస్తూ దెబ్బతిన్న ప్రాంతంలో సడన్‌గా బ్రేక్ వేస్తున్నారు. దీంతో వాటి వెనుక వస్తున్న వాహనాలు ముందు వెళ్లే వాహనాలను ఢీకొని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా, గురువారం ఉదయం ముందు వేగంగా వెళుతున్న ఒక కారు దెబ్బతిన్న రోడ్డు వద్ద బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న మోటారుసైకిల్ కారును ఢీకొనటంతో మోటారుసైకిల్‌పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఇలా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నందున దెబ్బతిన్న రోడ్డుపై ప్యాచ్‌వర్క్ చేసి గుంతలు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్యాచ్‌వర్క్ ఆలస్యమయ్యే పరిస్థితి ఉంటే అక్కడ సూచిక బోర్డు అయినా ఏర్పాటుచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



అల్లూరు : గిరిజనులతో మాట్లాడుతున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ



కలిగిరి: పౌరహక్కులను తెలియజేస్తున్న తహసీల్దారు గిరీష్

అల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ అన్నారు. ప్రతీనెలా చివరి రోజు పౌర హక్కుల దినోత్సవంగా మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని అన్ని శాఖల అధికారులు హాజరై పౌరహక్కుల గురించి వివరించేలా కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టరు ఆదేశానుసారం అల్లూరు పట్టణ పరిధిలోని ఉద్దీపగుంట గిరిజన కాలనీలో గురువారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనులకు పౌర హక్కుల గురించి వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ప్రసాదరావు, ఆర్ఐ ప్రభు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

- **కలిగిరి :** పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెం గ్రామంలో గురువారం తహసీల్దారు గిరీష్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు తనకున్న హక్కులను విధిగా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు ఆర్ మురళిమోహన్, పి చినరాజ్యం, నర్రావుల రామకృష్ణ గ్రామరెవెన్యూ సహాయకులు టి సత్యనారాయణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

- **బిట్రగుంట :** ప్రతి పౌరుడు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మండల తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి అన్నారు. బోగోలు మండలం ఎస్సీపాలెం పంచాయతీలోని గిరిజన కాలనీలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. హక్కుల గురించి గిరిజనులకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగితెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కాకి తిరుపతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



ఆలయ నిర్మాణానికి సాయం అందిస్తున్న బొల్లినేని

కలిగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు గురువారం మండలంలో పర్యటించారు. కావలి ముస్తాపురం పంచాయతీ దంటుపాలెం గ్రామంలో సీతారామస్వామి దేవస్థానం నిర్మాణానికి రూ.10వేల నగదును గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పెద్దకొండూరు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు నోటి రమణారెడ్డి అనారోగ్యానికి గురై ఇంటివద్ద చికిత్స పొందుతుండగా బొల్లినేని ఆయన్ను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 20వేల ఆర్థిక సహాయం అందజేశారు.

- **కొండాపురం:** మండలంలోని కొమ్మి పంచాయతీ రామానుజపురం గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు ఆకుల మాలకొండయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా మాజీ ఎమ్మెల్యే బొల్లినేని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ కన్వీనర్ చెరుకూరు వెంకటాద్రి, సీనియర్ నాయకులు వల్లూరు వెంకటేశ్వర్లు, చిట్టాబత్తిన బాలయ్య, నర్రావుల వెంకటేశ్వర్లు, నర్రా చెంచునాయుడు, పదర్ల తిమోతి, ఆకుల మహేష్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపెంట సబ్‌స్టేషన్‌లో విద్యుత్ పునరుద్ధరణ



కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసిన విద్యుత్ శాఖ అధికారులు

కావలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ మండలం తుమ్మలపెంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది బిగించి గురువారం విద్యుత్‌ను పునరుద్ధరించారు. కాగా, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించటానికి జిల్లా ఎస్ఈ విజయన్, కావలి ఈఈ బెనర్జీ, డిప్యూటీ ఈఈ రవికుమార్, రూరల్ ఏఈ శ్రీనివాసులురెడ్డి తోపాటు సుమారు 60 మంది ఆపరేషన్ సిబ్బంది శ్రమించి 36 గంటలలో విద్యుత్‌ను పునరుద్ధరించటంతో ఆయా గ్రామాల ప్రజలతోపాటు ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చశారు.

మృతుడి కుటుంబానికి మంద కృష్ణమాదిగ పరామర్శ



సూరపోగు శ్యామ్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ

కందుకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్‌లో క్రియాశీలంగా పనిచేసి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సూ రపోగు శ్యామ్ కుటుంబ సభ్యు లను ఎంఆర్‌పీఎస్ వ్యవ స్థాపకుడు మంద కృష్ణమాదిగ గురువారం పరామర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆది ఆంధ్ర కాలనీలో శ్యామ్ నివా సానికి వెళ్లి శ్యామ్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పిం చారు. కార్యక్ర మంలో ఆయన వెంట ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ ఎఫ్, ఎంఈఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగకు సత్కారం

కాగా, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని ఓగూరులో మందకృష్ణమాదిగను కలిసిన వారు ఆయనను దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

సందేహాలు నివృత్తి చేశాకే భూసేకరణ జరపాలి : దివి

కందుకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీకి బలవంతంగా భూసేకరణ చేయాలన్న ఆలోచనను అధికారులు మార్చుకుని రైతులు, గ్రామస్థుల సందేహాలు నివృత్తి చేయటం ద్వారా రైతుల సహకారంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం ఒక ప్రకటనలో కోరారు. ఇండోసోల్ ప్రతినిధులతో కలిసి జిల్లా అధికారులు కరేడులో సమావేశం ఏర్పాటుచేయటం ద్వారా అన్ని వేల ఎకరాలు సోలార్ ప్యానళ్ల తయారీ పరిశ్రమకు ఎందుకు అవసరమవుతుందో వివరించాలని కోరారు. అలాగే కరేడులో ఈ పరిశ్రమ ఏర్పాటువలన భవిష్యత్తులో వచ్చే ఇబ్బందులు పైనా రైతులకు, గ్రామస్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు.

ఆధార్ కేంద్రం లేక ప్రజలు, విద్యార్థుల ఇక్కట్లు

- అప్‌డేట్ కోసం పట్టణాలకు పరుగులు
- వృద్ధులు, చిన్నారుల అవస్థలు

కొండాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ఇతర మండలాలకు, పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో విద్యార్థులు సుమారు 8000 మంది వరకు ఉన్నారు. వీరిలో ఎక్కువమంది విద్యార్థులకు ఆధార్‌లో వివరాలలో కొద్దిపాటి తేడాలున్నాయి. పేర్లు, పుట్టిన తేదీ, జండర్ తదితర విషయాలలో తేడాలుండటం వలన ఆన్‌లైన్లో నమోదు కావడంలో ఇటు విద్యార్థులు అటు పాఠశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు నూతనంగా ఆధార్ కార్డు తీయించుకునేవారు, పెద్దలు, రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో లబ్ధి పొందేందుకు తమ ఆధార్‌లో కొంత సమాచారాన్ని అప్‌డేట్ చేయించాల్సి ఉంటుంది. వీరందరూ 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న కావలి, కందుకూరు పట్టణాలకు వెళ్లి గంటలు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి సర్వర్లు పనిచేయక మరుసటిరోజు వెళ్లాల్సి వస్తోంది. దీంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా, మండలంలో గతంలో గుడవళ్లూరు, తూర్పు ఎర్రబల్లి, చింతలదీవి గ్రామాలలోని సచివాల యాలలో ఆధార్ కేంద్రాలు ఉండేవి. వీటిలో ఒక్క ఆధార్ కేంద్రం కూడా ప్రస్తుతం పనిచేయడంలేదు. ఇదిలా ఉండగా సాయిపేట, చింతలదీవి సచివాలయాలలో నూతనంగా ఆధార్ కేంద్రం ఏర్పాటుచేసేందుకు సుమారు 3 నెలల క్రితం మెటీరియల్ సచివాలయాలకు చేరింది. అప్పటి నుంచి వాటిని మూలన పడేశారు. అలాగే ఆధార్ కేంద్దరం నిర్వహణకు సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ కేంద్రాలను ప్రారంభించి సమస్యలు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలను ఉన్నతాధికారులకు తెలియచేశాం: ఇన్‌చార్జి ఎంపీడీవో

మండలంలో ఆధార్ సమస్యలపై ఉన్నతాధికారులకు తెలియచేశామని ఇన్‌చార్జి ఎంపీడీవో శేషసాయి తెలిపారు. గతంలో ఆధార్ తీయడంలో అర్హత ఉన్న ఉన్న డిజిటల్ అసిసెంట్లు బదిలీ కావడంతో జాప్యం నెలకొంది. బదిలీపై వచ్చిన డిజిటల్ అసిస్టెంట్లు ప్రత్యేకంగా నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులైన వెంటనే ఆధార్ కేంద్రాలు ఏర్పాటుచేయడం జరుగుతుంది. ఈవిషయంలో ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తామన్నారు.

పారిశ్రామిక వాడ ఏర్పాటుకు గ్రామసభలో ఆమోదం



గ్రామసభనిర్వహిస్తున్న తహసీల్దారు, రెవెన్యూసిబ్బంది

కలిగిరి, జూలై 31: మండలంలోని పెదకొండూరు గ్రామ సర్వే నెంబరు 739లో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు గురువారం నిర్వహించిన గ్రామ సభలో గ్రామస్థులు ఆమోదం తెలిపినట్లు తహసీల్దారు గిరీష్ తెలిపారు. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సభలో స్థానికులు కోరారన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితోపాటు సర్పంచ్ మొక్కా సుజాత, స్థానిక టీడీపీ నాయకులు బీవీ రామారావు, మొక్క హజరత్‌రావు, పాల్గొన్నారు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్న మన్నవ, మలిశెట్టి

కావలి (టౌన్) జూలై 31 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకులు మన్నవ రవిచంద్ర సతీమణి విజయకుమారి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం వెంగళరావు నగర్‌లోని మన్నవ స్వగృహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ముందుగా విజయకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె జ్ఞాపకార్థం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, కమ్మవారి సేవా సంఘం నాయకులు గడ్డం శ్రీనివాసులు నాయుడు, ప్రొఫెసర్ ఏవీ నాయుడు, మన్నవ యశ్వంత్ చౌదరి తదితరుల చేతుల మీదుగా 12 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున స్కాలర్‌షిప్‌ల రూపంలో అందించారు. అతిథులు మాట్లాడుతూ మన్నవ తన సతీమణి జ్ఞాపకార్థం పేద ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రదానం



అల్లి బుజ్జమ్మ (ఫైల్)

కావలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం పుల్లారెడ్డినగర్‌కు చెందిన అల్లి బుజ్జమ్మ (82) గురువారం మరణించారు. కావలి రెడ్‌క్రాస్ మరణానంతర సేవల విభాగం కన్వీనర్ కలికి శ్రీహరిరెడ్డి ప్రేరణతో ఆమె కుమారుడు అల్లి ప్రసాద్ తన తల్లి నేత్ర దానానికి అంగీకరించారు. కావలి రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం పర్యవేక్షకురాలు ఇలింద్ర శ్రీవాణి నెల్లూరు మోడరన్ ఐ బ్యాంకుకు బుజ్జమ్మ నేత్రాలను దానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఆమె కార్నియాలను మోడరన్ ఐ బ్యాంకు టెక్నిషియన్ నాగేశ్వరరావు సేకరించారు. కుటుంబ సభ్యులకు కలికి శ్రీహరిరెడ్డి నేత్రదాన ప్రశంసా పత్రాన్ని అందచేశారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 141వ నేత్రదానమని రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ తెలిపారు.

పగిలిన మంచినీటి పైపులైన్

- నిలిచిన నీటి సరఫరా

లింగసముద్రం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీసేవా కేంద్రం సమీపంలో అంతర్గత మంచినీటి పైపులైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయి అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 15 రోజుల క్రితం మంచినీటి పైపులైన్ పగిలిందని, ఈ విషయం అధికారులకు కూడా తెలియజేశామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని మంచినీరు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

ఎన్నికల ప్రచారానికే క్రీడాభివృద్ధి పరిమితం

- వైసీపీ ప్రభుత్వంలో క్రీడా వికాసానికి గ్రహణం



బేస్‌మెంట్ దశలోనే నిలిచిపోయిన క్రీడా వికాస కేంద్రం

కావలి(టౌన్) జూలై 31 (ఆంధ్రజ్యోతి)ప్రభుత్వాలు మారుతున్నాయే గాని క్రీడాకారుల తలరాత మటుకు మారటం లేదు. విద్యార్థికి విద్యతో పాటు క్రీడలు రెండు కళ్ళు లాంటివని క్రీడాభ్యున్నతికి పాటుపడతామని క్రీడా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పాలకులు అధికారులు తమ ప్రసంగాల్లో ఊదర గొట్టడమేకాక ఎన్నికల ప్రచారంలో క్రీడాభివృద్ధి ప్రచార అస్త్రంగా వాడుకోవడం అనంతరం గాలికి వదిలేయడం పరిపాటిగా మారింది. 2001లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కావలి విట్స్ కళాశాల పక్కన కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిలో మినీ స్టేడియం నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అప్పటి హోమ్ మంత్రి దేవేందర్ గౌడ్ శంకుస్థాపన చేసారు. ఇప్పటికీ స్టేడియం నిర్మాణం అతీగతీ లేక ఎటువంటి సౌకర్యాలు లేని గులకరాళ్ళ మైదానంలోనే పిల్లలు యువకులు ఆడుకుంటు కాలం వెళ్ళదీస్తున్నారు. క్రీడాభివృద్ధి ఏమాత్రం జరుగుతుందో కావలి స్టేడియం మంచి ఉదాహరణగా కనిపిస్తుంది.

పునాదిలోనే శిథిలమౌతున్న క్రీడా వికాస కేంద్రాలు

2014-15 సంవత్సరాల్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో క్రీడా వికాస కేంద్రాలు(కెవికె) ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలతో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 10 కెవికె కేంద్రాలు మంజూరు చేసి ఒక్కో కేంద్రానికి రూ.2కోట్లు మంజూరు చేసింది. (శాప్) స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పర్యవేక్షణలో (ఏపీఇడబ్లుఐడీసి) ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నిర్మాణ పనులు అప్పజెప్పారు. ప్రస్తుత నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కావలి కెవికె కేంద్రం బేస్‌మెంట్ దశలో అర్థాంతరంగా ఆగిపోయింది. కోవూరు నియోజకవర్గ పరిధిలోని విడవలూరు జెడ్పీ పాఠశాల మైదానం ప్రాంగణంలో, ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో క్రీడా వికాస కేంద్రాలు వివిధ దశలో పనులు జరిగాయి.

వైసీపీ ప్రభుత్వంలో క్రీడా వికాసానికి గ్రహణం

క్రీడాకారుల అభ్యున్నతికి టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన క్రీడా వికాస కేంద్రాలకు వైసీపీ ప్రభుత్వంలో గ్రహణం పట్టింది. టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన కెవికె కేంద్రాలు వైసీపీ ప్రభుత్వం వచ్చాక అనేక రకాల కొర్రీలు పెట్టి పనులు అడ్డుకోవడంతో నిర్మాణ పనులు ఒక్క అంగుళం కదలక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారింది. కావలి కెవికె నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ముందుకు రాగా అప్పటి వైసీపీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి కెవికె ప్లాన్ బాగా లేదని అవసరాలకు తగ్గట్లుగా లేదని పనులను అడ్డుకున్నారు. రూ.7.50కోట్ల ప్రతిపాదనలతో నూతన ప్లాన్ రూపొందించి ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు తెస్తామన్న హామీలు నెరవేరకపోవడం అంకిచెడె మంకి చెడె అన్న సామెతగా కెవికె పనులు బేస్‌మెంట్ దశలో ఆగిపోవడమేకాక శిథిలమైపోయే ప్రమాదముంది.

ఆధిపత్య పోరు

(5వ పేజీ తరువాయి)

మంచిదని సీనియర్ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.


- **అసమానతలు తొలగించాలి...**

గ్రేడ్-2 హెచ్ఎంలను కన్వర్షన్ ద్వారా ఎంఈవోలుగా నియమించగా, గత వైసీపీ ప్రభుత్వం వివక్ష కారణంగా ఎంఈవో-1ను డీడీవోగా, ఎంఈవో-2ను నాన్ డీడీవోలుగా విభజించి, సమానహోదాను దూరం చేసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఇద్దరు ఎంఈవోల వ్యవస్థ మధ్య అసమానతలు సృష్టించిందని, దీంతో ప్రజల్లో ఎంఈవో-2 అంటే చులకనభావం నెలకొందని మండల స్థాయి అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ వ్యవస్థలో కూడా ఇద్దరు అధికారుల పర్యవేక్షణ లేదని, ఆయన పేర్కొన్నారు. అధిక శాతం మంది ఎంఈవోలు దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో తిష్టవేయడంతోపాటు విద్యాశాఖలో ఎంతో కీలకమైన ఎంఈవో-1 పోస్టులకు సంబంధించి అందరూ కూడా అన్నీ వసతులు కలిగి, నగరానికి సమీపంలో ఉన్న మండలాలు, రోడ్డు సర్వీస్ ఉన్న మండలాల్లో మాత్రమే రెగ్యులర్‌గా పనిచేస్తున్నారని టీచర్లు ఆరోపిస్తున్నారు. జిల్లాకు సుదూర ప్రాంతాలు, వసతులు లేనిచోట మాత్రం ఎవరూ సుముఖత చూపకపోవడంతో 20 మండలాల్లో ఇన్‌ఛార్జి ఎంఈవో-1లతో నెట్టుకురావాల్సి వస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం శాఖాపరమైన సమీక్ష, మరోరోజు ఉన్నతాధికారుల సమీక్ష, వీటికితోడు ప్రజాప్రతినిధుల కార్యక్రమాల్లో ప్రొటోకాల్ హాజరు తదితర కార్యక్రమాలతోనే తమకు సమయం సరిపోతున్నదని ఎంఈవో ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటిపై సమీక్ష చేసి ఏకీకృత విధానంతో సమస్యను పరిష్కరించాలని అత్యధికశాతం మంది ఎంఈవోలు కోరుతున్నారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5




తిరుపతి

జిల్లా వార్తలు

శుక్రవారం 1 ఆగస్టు 2025

ప్రజాప్రతినిధులకు పట్టని పీ4



బంగారు కుటుంబాల దత్తతకు ఒక్కరూ ముందుకు రాని వైనం

పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమమే పీ4. పేదలకు సంపన్నుల చేయూత అందించడమే ఈ పథకం ఉద్దేశ్యం. పేదలు ఆత్మన్యూనతకు గురికాకూడదనే ఆలోచనతో వీరికి బంగారు కుటుంబాలు అనే పేరు పెట్టారు. చంద్రబాబు మదిలో మెదిలిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ సారథ్యంలో అధికార యంత్రాంగం సవాలుగా స్వీకరించింది. బంగారు కుటుంబాలకు చేదోడుగా నిలిచే మార్గదర్శుల కోసం గట్టి ప్రయత్నమే జరిగింది. ఇప్పటికే 3330 మంది ముందుకొచ్చారు. 19,546 కుటుంబాలను అండగా నిలబడతామని సిద్ధపడ్డారు. అధికారులు, పారిశ్రామిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు ఎందరో ముందుకొచ్చినా.. విచిత్రంగా ఒక్క ఎమ్మెల్యే కూడా మార్గదర్శిగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటానని ప్రకటించలేదు.

తిరుపతి
ఆంధ్రజ్యోతి

జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలు:	83,000
అత్యధికం గూడూరు నియోజకవర్గంలో:	14,000
ముందుకొచ్చిన మార్గదర్శులు:	3330
దత్తత తీసుకోనున్న కుటుంబాలు:	19,546

ఎంపిక ఇలా..

ఇదివరకే ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతో పాటూ వివిధ సర్వేల ద్వారా జిల్లాలోని నిరుపేద కుటుంబాలను గుర్తించారు. ఈ జాబితాను వేర్వేరు బృందాలతో పరిశీలించి నిర్ధారించుకున్నారు. వీరి సామాజిక, ఆర్థిక స్థితిగతులు, కుటుంబ అవసరాలు, ఆరోగ్య సమస్యలు, పిల్లల చదువులు వంటి వివరాలు నమోదు చేసుకున్నారు. దత్తత ద్వారా వీరికి అండగా నిలువగలిగితే ఈ కుటుంబాలు నిలదొక్కుకుంటాయని అంచనా వేశారు.

ఏ నియోజకవర్గంలో ఎందరు?

సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో 12 వేలకు పైగా బంగారు కుటుంబాలను గుర్తించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 11 వేలకు పైగా, వెంకటగిరి మూడు మండలాల పరిధిలో 7 వేలు, తిరుపతిలో 6 వేలు, నగరి రెండు మండలాల పరిధిలో 3 వేలు చొప్పున నిరుపేద కుటుంబాలను గుర్తించారు.

3330 మంది మార్గదర్శులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమం కావడంతో కలెక్టర్ సైతం దీని అమలును సవాల్‌గా తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ధనవంతులతో వర్గాల వారీగా, ప్రాంతాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 7వ తేదీకి 5 మంది మార్గదర్శులు మాత్రమే ముందుకొచ్చి 1911 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అంగీకరించగా కలెక్టర్ చొరవతో ఈ సంఖ్య 3330కి చేరుకుంది. వారు 19,546 కుటుంబాలను దత్తత తీసుకోవడానికి అంగీకరించారు.

సీఎం పిలుపిచ్చినా స్పందించని ప్రజాప్రతినిధులు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పరిగణిస్తున్నారు. పేదరిక నిర్మూలనకు ఈ కార్యక్రమం ప్రపంచ వ్యాప్తంగా ఆదర్శం అవుతుందని బలంగా విశ్వసిస్తున్నారు. సీఎం పిలుపుతో ప్రవాసాంధ్రులు సైతం స్పందించి మార్గదర్శులుగా మారేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. అయితే జిల్లాలో ప్రజాప్రతినిధుల నుంచీ మాత్రం ఎలాంటి స్పందనా లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇప్పటి వరకూ సీఎం చంద్రబాబు మూడు పర్యాయాలు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించారు. ఈనెల 19న స్వయంగా తిరుపతికి వచ్చి రెండు బంగారు కుటుంబాలకు చెందిన బాధితులను స్వర్ణాంధ్ర- స్వర్ణాంధ్ర సదస్సులో మాట్లాడించి, వారిని దత్తత తీసుకున్న మార్గదర్శులను అభినందించారు. అయినా ప్రజాప్రతినిధులు ఎవరూ మార్గదర్శులుగా మారేందుకు, కనీసం ఒక నిరుపేద కుటుంబాన్ని అయినా దత్తత తీసుకునేందుకు ముందుకు రాకపోవడం గమనార్హం.

ఐదు షికారీ కుటుంబాలను దత్తత తీసుకున్న కలెక్టర్

ఈ కార్యక్రమానికి సారథ్యం వహిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ ఐదు కుటుంబాల బాధ్యత తీసుకున్నారు. కలెక్టరేట్ పక్కనే ఉన్న షికారీ కాలనీ నుంచి ఈ కుటుంబాలను ఎంపిక చేసుకున్నారు. ఐదు కుటుంబాల్లో 18 మంది సభ్యులున్నారు. వారితో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. పెళ్లయిన జంటలకు విడిగా ఇళ్లు, ఇళ్ల స్థలాలు కావాలని వారు అడిగారు. అలాగే పిల్లల చదువులకు సాయం చేయాలని, జీవనోపాధికి ఆర్థిక సాయం కావాలని కోరారు. ఇళ్ల స్థలాలను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించడానికి నిర్ణయించిన కలెక్టర్.. ఇళ్ల నిర్మాణం, పిల్లల చదువు, ఉపాధికి ఆర్థిక సాయం వంటి వాటికి దేశంలోనూ, విదేశాల్లోనూ వున్న తన స్నేహితులను సంప్రదించారు. వారు సాయం చేసేందుకు అంగీకరించారు.

వీఆర్వోను లైంగికంగా వేధించారని

వాకాడు తహసీల్దార్ సస్పెన్షన్

సోషల్ మీడియాలో తహసీల్దార్ నగ్న వీడియోలు

వేధింపులా, బ్లాక్‌మెయిలా?



రామయ్య (ఫైల్ ఫొటో)

నాయుడుపేట/వాకాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో ఓ మహిళా వీఆర్వోను వాకాడు తహసీల్దార్ లైంగికంగా వేధించారంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలు జిల్లాలో సంచలనం సృష్టించాయి. వీడియోలో ఉన్న తహసీల్దార్ రామయ్యను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయడంతో పాటూ సంఘటనపై విచారణకు ఆదేశించారు. అయితే ఈ సంఘటనపై భిన్న వాదనలు వినిపిస్తుండగా, ఇద్దరు విలేకర్ల పాత్రపై ఆరోపణలు వెలువడుతున్నాయి.

వీడియోల్లో ఏముంది?

వాకాడు తహసీల్దార్ రామయ్య నాయుడుపేటలోని పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు వీఆర్వో కళ్యాణి ఇంట్లో నగ్నంగా ఉండగా ఆయనపై వీఆర్వో తల్లి చీపురుతో దాడి చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆయన ప్యాంటు తొడుక్కుని బయటకు వెళ్లే ప్రయత్నాన్ని కొందరు అడ్డుకుంటున్నట్టు వీడియోల్లో ఉంది. జూన్ 24న ఈ సంఘటన జరగ్గా, 31న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

లైంగికంగా వేధించారు: వీఆర్వో

పెళ్లకూరు మండలం తహసీల్దారుగా రామయ్య పనిచేస్తున్నప్పటి నుంచి కూడా తనను లైంగికంగా వేధిస్తున్నారని వీఆర్వో కళ్యాణి ఆరోపిస్తున్నారు. తన తల్లికి ఈ విషయం చెప్పానన్నారు. 24వ తేదీన తన ఇంటికి వచ్చి లైంగిక దాడికి దిగారని చెప్పారు. దాంతో తనకు సన్నిహితులైన ఇద్దరు విలేకర్లకు ఫోన్ చేసి పిలిపించానని తెలిపారు.

విలేకర్ల పాత్రపై ఆరోపణలు

ఈ సంఘటనపై విలేకర్ల పాత్ర మీద కూడా విమర్శలు సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి. 24న సంఘటన జరిగితే ఇన్ని రోజులు ఎందుకు వెలుగులోకి తీసుకురాలేదని ప్రశ్నిస్తున్నారు.డబ్బులు గుంజే ప్రయత్నం ఫలించకపోవడంతోనే వీడియోలు వైరల్ చేశారని ఆరోపిస్తున్నారు. ఇందువల్ల బాధితురాలైన వీఆర్వో ప్రతిష్ఠకు సైతం వారు తీవ్రంగా నష్టం కలిగించారని నెటిజన్లు మండిపడుతున్నారు. తనను కోటి రూపాయలు డిమాండ్ చేశారని తహసిల్దార్ రామయ్య ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక విలేకరి వారంలోగా రూ.35 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, ఆ తర్వాత నెల రోజులకు మరో రూ.35లక్షలు ఇవ్వాలన్నారని ఆయన పేర్కొన్నారు. లేకుంటే తన ప్రతిష్ఠ దెబ్బతినేలా వీడియోలు బయట పెడతామని బెదిరించారన్నారు. ఆ విలేకర్లే బలవంతంగా తన బట్టలు పీకేసి వీడియోలు తీశారని ఆయన పేర్కొన్నారు. భిన్న వాదనలు వినిపిస్తున్న ఈ సంఘటనపై లోతుగా దర్యాప్తు జరిపితేనే వాస్తవాలు వెలుగు చూస్తాయి.


ఇదంతా బ్లాక్ మెయిల్ కుట్ర: తహసీల్దారు

తనను కుట్రపూరితంగా ఇరికించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తహసిల్దార్ రామయ్య చెబుతున్నారు. వీఆర్వో కళ్యాణి పథకం ప్రకారం తనను ఇంటికి రప్పించి ఇద్దరు విలేకరులతో కలిసి తన నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేయాలని పథకం వేశారన్నారు. ఇద్దరు విలేకర్లు కోటి రూపాయలు ఇవ్వాలంటూ తనను బెదిరించడంతో బుధవారం కలెక్టర్‌కు, గురువారం ఎస్పీకి ఫిర్యాదు చేశానని తహసీల్దారు రామయ్య ఆంధ్రజ్యోతికి తెలిపారు.

తహసీల్దారు సస్పెన్షన్

వీఆర్వో కళ్యాణి చేసిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం రాత్రి తహసీల్దారు రామయ్యను సస్పెండ్ చేశారు. విచారణకు సైతం ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రోజ్‌మాండ్‌ను విచారణాధికారిగా నియమించారు. కాగా గురువారం రాత్రి వాకాడు తహసీల్దారు రామయ్య చేసిన ఫిర్యాదుతో ఎస్పీ హర్షవర్ధన్ రాజు కూడా విచారణకు ఆదేశించారు. స్పెషల్ బ్రాంచి సీఐకి విచారణ బాధ్యతలు అప్పగించారు.

సారూ.. పింఛనిచ్చి ఆదుకోండి



మంచానికే పరిమితమైన వృద్ధురాలు రత్నమ్మ

● 70 ఏళ్ల వృద్ధురాలి వేడుకోలు ● గత ప్రభుత్వంలో తప్పిదంతో పాట్లు

మంచానికే పరిమితమైన ఈ వృద్ధురాలి పేరు రత్నమ్మ. వయసు దాదాపు 70 ఏళ్లు. ఊరు కేవీబీపురం మండలంలోని దేశూరివారి కండ్రిగ. 20 ఏళ్ల కిందటే భర్త చనిపోయాడు. తనకంటూ ఎవరూ లేరు. ఆ ఊర్లో ఒకరు ఏ పూటకాపూట తిండి తెచ్చి పెడుతున్నారు. అలాంటి ఆమెకు పింఛను లేదు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే.. అప్పటి వరకు వస్తున్న పింఛను ఆగిపోయింది. ఏమంటే.. ఆమె పేరిట రెవెన్యూ రికార్డుల్లో ఐదు ఎకరాల భూమి ఉందట. అయ్యో సారూ.. ఆ భూమి ఎప్పుడో అమ్మేశాను. ఇప్పుడు నాకంటూ సెంటు పొలం లేదని ఆమె మొత్తుకున్నా రెవెన్యూ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. ఈమె వద్ద కొన్న వ్యక్తి రిజిస్టర్ చేసుకున్నా.. రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్చుకోలేదు. ఇలా ఒక తప్పిదం.. ఆ నిస్సహాయ స్థితిలోని అమ్మకు పింఛను లేకుండా చేసింది. ఎవరూ లేక.. ఆరోగ్యం బాగోలేక మంచానికే పరిమితమైన తనకు అధికారులు విచారించి.. వాస్తవం తెలుసుకుని పింఛను ఇప్పించాలని రత్నమ్మ కోరుతోంది. ఆ పింఛను డబ్బులొస్తే మందుల ఖర్చుకైనా ఉంటుందని ఆమె ఆశ.

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

అన్నదాత సుఖీభవకు 1,54,807మంది రైతులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి 1,54,807 మంది రైతులు అర్హత కలిగి ఉన్నారని, ఇందులో 1,50,161మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారని, 3,114మంది ఈకేవైసీ రిజక్టు కాగా 1,532మందివి పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ప్రకాశం జిల్లా దర్శిలో ప్రారంభించనున్న ఈ పథకంపై అమరావతి నుంచి సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులకు రూ.20వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.



సీఎం వర్చువల్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్



మినీ ఫాస్ట్ కంపోస్టర్‌తో విద్యార్థులు, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్

తడుకు నుంచి ఢిల్లీకి

● విద్యార్థుల ప్రాజెక్టు 'మినీ ఫాస్ట్ కంపోస్టర్'కు జాతీయ స్థాయిలో రెండో అవార్డు

● సోలార్‌తో పనిచేసేలా రూపకల్పన

6

కల్యాణి డ్యామ్ వైపు మళ్లీ ఏనుగులు

● రాగిమాకులకుంట సమీపాన వరి పంట ధ్వంసం

చంద్రగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని శేషాచల అటవీ ప్రాంత సరిహద్దుల్లో మూడు రోజులుగా గజరాజులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గురువారం తెల్లవారుజామున ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలోని రాగిమాకులకుంట సమీపంలో గోవర్ధన్ పొలంలో చొరబడి వరి పంటను ధ్వంసం చేశాయి. అనంతరం కల్యాణి డ్యామ్ వైపు వెళ్లాయి. దీంతో ఆప్రాంత ప్రజలను అటవీ అధికారులు అప్రమత్తం చేశారు. రాగిమాకులకుంట, దుర్గం ఎస్టీ కాలనీల వైపు ఏనుగుల గుంపు రాకుండా అటవీ సిబ్బంది బాణసంచా కాల్చారు. డప్పులు వాయించారు. శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ, నరసింగాపురం పంచాయతీలోని సత్యసాయి ఎస్టీ కాలనీ, రామిరెడ్డిపల్లె పంచాయతీలోని వైకుంఠపురం ఎస్టీ కాలనీ, ఎ.రంగంపేట పంచాయతీలోని ఎంబీయూ విద్యాసంస్థ ప్రాంతం, రాగిమాకుల ఎస్టీ కాలనీ, దుర్గం ఎస్టీ కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగపట్ల రేంజ్ ఫారెస్ట్ అధికారులు హెచ్చరించారు. రాత్రి వేళల్లో రైతులు పొలాలకు వెళ్ళకూడదని సూచించారు. ఏనుగుల ఉనికి గురించి తెలిస్తే వెంటనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం అందించాలని కోరారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలు

పోలీసు స్టేషన్లకు అనుసంధానం

● వీడియో కాన్ఫరెన్సులో బ్యాంకర్లకు ఎస్పీ సూచన

తిరుపతి(నేరవిభాగం), జూలై 31(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలోని అన్ని జాతీయ, ప్రైవేటు బ్యాంకుల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు, అలారాలు ఏర్పాటు చేసుకోవాలి. బ్యాంకుల వద్దనున్న సీసీ కెమెరాలను పోలీసు స్టేషన్లకు అనుసంధానం చేయాలి. దీనివల్ల రాత్రి సమయాల్లో స్టేషన్ల నుంచి ప్రత్యేక నిఘా ఉంచడానికి అవకాశం ఉంటుంది' అని ఎస్పీ హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం తిరుపతిలోని ఎస్పీ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలోని బ్యాంకర్లు, డీఎస్పీలు, సీఐలతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. హిందూపురంలో బ్యాంకు దోపిడీ జరిగిన నేపథ్యంలో ముందస్తు చర్యలపై బ్యాంకర్లు, పోలీసు అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. బ్యాంకుల్లోని సీసీ కెమెరాల పనితీరు, రికార్డు అవుతున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల్లో ఎన్ని నెలల పాటు బ్యాకప్ వుంటుందని అడిగారు. క్వాలిటీ కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో సెక్యూరిటీ ఎంతమంది ఉంటారు? వారి విధులేంటనే వివరాలు తమకు ఇవ్వాలని బ్యాంకు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కొన్ని ఏటీఎంల వద్ద నున్న సాంకేతిక సమస్యలను పరిశీలించి పునరుద్ధరించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం బ్యాంకు డ్యూటీకి వచ్చినప్పుడు చెక్ లిస్టు ఏర్పాటు చేసుకోవాలని.. క్లోజ్ చేసి వెళ్లేముందు అన్నీ జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు.




బ్యాంకర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తున్న ఎస్పీ

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

తిరుపతి(కలెక్టరేట), జూలై31(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారిణి వసంతబాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిశువుల ఆరోగ్యం, వారి అభివృద్ధికి తల్లిపాలే కీలకమని పేర్కొన్నారు. శిశువులకు అవసరమైన పోషకాలను తల్లిపాలు అందిస్తాయని తెలిపారు. అధికారులు, సిబ్బంది పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఏసీబీ కేసులో సీఐ వెంకటప్పపై చర్యల నిలిపివేత

తిరుపతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తిరుపతి డీసీఆర్బీ సీఐ కుటాల వెంకటప్పపై ప్రభుత్వం తదుపరి చర్యలు నిలిపివేసింది. వివరాలిలా వున్నాయి. ఐదేళ్ల కిందట తిరుపతి కమాండ్ కంట్రోల్ సెంటర్ సీఐగా పనిచేస్తున్న ఆయనపై అవినీతికి పాల్పడడం ద్వారా ఆదాయానికి మించిన ఆస్తులు కలిగివున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో 2020 మార్చి 11న వెంకటప్పపై కేసు నమోదు చేసిన తిరుపతి ఏసీబీ అధికారులు అదే రోజున నెల్లూరు స్పెషల్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండు విధించడంతో ఆ రోజే సీఐ వెంకటప్పను అనంతపురం డీఐజీ సస్పెండ్ చేశారు. మరోవైపు వెంకటప్పకు చెందిన రూ.1.88 కోట్ల విలువైన స్థిరచరాస్తులను ఏసీబీ అధికారులు కోర్టుకు అటాచ్ చేశారు. రెండేళ్ల తర్వాత 2022 జూన్ 23న ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేసింది. ఈ ఏడాది జూన్ 16న ఏసీబీ డైరెక్టర్ జనరల్ సమర్పించిన తుది నివేదికలో వెంకటప్పకు ఆదాయానికి మించి రూ.58.52 లక్షల విలువైన ఆస్తులు మాత్రమే కలిగివున్నట్టు నిర్ధారించారు. ఆదాయానికి మించి 15.45 శాతం మాత్రమే ఆస్తులు అధికంగా వున్నందున నిబంధనల రీత్యా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం లేదని, అందువల్ల తదుపరి చర్యలు నిలిపివేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు. దీంతో సీఐ కుటాల వెంకటప్పపై తదుపరి చర్యలను నిలిపివేయడంతో పాటు ఆయన సస్పెన్షన్ కాలాన్ని డ్యూటీలో ఉన్నట్టుగా పరిగణిస్తున్నట్టు రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సీఐ వెంకటప్ప ప్రస్తుతం తిరుపతి డీసీఆర్బీలో పనిచేస్తున్నారు.







తిరుమల.. పచ్చని సోయగాల మాల

ఇల వైకుంఠంగా భక్తులు భావించే తిరుమల గిరులు పచ్చదనంతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఇటీవల కురుస్తున్న అడపాదడపా వర్షాలకు చెట్లన్నీ చిగురించి ఈ ఆధ్యాత్మిక ప్రాంతానికి కొత్త వన్నెలద్దాయి. భక్తులను ఆహ్లాదంతో పులకరింపజేస్తున్నాయి. గుండెనిండా భక్తి నింపుకొని ఏడుకొండలను చేరుకుంటున్న వారు హరితకాంతలా మారిన తిరుమల కొండలను చూసి తన్మయత్వం చెందుతున్నారు. ప్రకృతి ప్రియులు ఈ నయనమనోహర అందాలను ఆస్వాదిస్తూ తమ కెమెరాల్లో బంధిస్తున్నారు. శేషాచలంతో పాటు సమీపంలోని ఎస్వీ యూనివర్సిటీ లాంటి ప్రాంతాలు కూడా పచ్చదనాన్ని పరుచుకుని కనువిందు చేస్తున్నాయి.

మెరిసిన మన ఆణిముత్యాలు

● తడుకు విద్యార్థుల 'మినీ ఫాస్ట్ కంపోస్టర్' ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి

తిరుపతి(విద్య), జూలై 31(ఆంధ్రజ్యోతి): మన జిల్లా విద్యార్థులు ఢిల్లీలో మెరిశారు. మన విజ్ఞాన వీచికలు జాతీయ స్థాయి వేదికలపై జిల్లా పేరును మార్మోగించాయి. మన జిల్లా విద్యార్థులు రూపొందించిన నమూనా ఏకంగా పేటెంట్ హక్కు గడప తొక్కనుంది. వడమాలపేట మండలం తడుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన 'సోలార్ మినీ ఫాస్ట్ కంపోస్టర్ సైన్స్ ప్రాజెక్ట్ జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకుని రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది.

జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మార్గ నిర్దేశంలో తడుకు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్ సోలార్‌తో పనిచేసే 'మినీ ఫాస్ట్ కంపోస్టర్'ను రూపొందించారు. జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌కుగాను 2024 జూలైలో పోటీలు నిర్వహించగా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 1,00,400 ప్రాజెక్టులు పోటీలో నిలిచాయి. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టులన్నింటినీ ఐదు దశల్లో వడపోయగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన 100 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. వాటిలో రాష్ట్రం నుంచి రెండు ఎంపికకాగా అందులో





సోలార్ మినీ ఫాస్ట్ కంపోస్టర్ - ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థులు

తడుకు విద్యార్థుల ప్రాజెక్టు ఒకటి. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని గాల్గొటీ యూనివర్శిటీలో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు జాతీయ స్థాయి విజ్ఞాన ప్రదర్శన-వర్క్‌షాప్-2025 జరిగింది. ఈ ప్రదర్శనకు జిల్లా విద్యార్థుల సైన్స్ ప్రాజెక్ట్‌తోపాటు మొత్తం 39 ప్రాజెక్టులు పోటీపడ్డాయి. వీటిలో సోలార్ మినీ ఫాస్ట్ కంపోస్టర్ ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. ఈ సందర్భంగా ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఏఐసీటీయూ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇళంగోవన్ కరియప్పన్ విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్‌ను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. మినీ ఫాస్ట్ కంపోస్టర్‌కు పేటెంట్ హక్కు పొందేందుకు ప్రతిపాదిస్తామని ప్రకటించారు. కాగా, మినీ ఫాస్ట్ కంపోస్టర్‌ను మరింత మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.90,500 ప్రకటించింది.

పరికరం.. ఎంతో ఉపయుక్తం

మినీ ఫాస్ట్ కంపోస్టర్ పరికరం ద్వారా వంటగది వ్యర్థాలు, పండ్లు, కూరగాయల తొక్కలు, కుళ్లిన ఆహారం, కూరగాయల నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయొచ్చు. ఇది సంప్రదాయ పద్ధతిలో కాకుండా ఏరోబిక్ కంపోస్ట్ పద్ధతిలో బ్యాక్టీరియాను వృద్ధి చెందించి వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మారుస్తుంది. బాక్టీరియా వ్యర్థాలను విచ్ఛిన్నం చేయడానికి కావాల్సిన ఉష్ణోగ్రతను విద్యుత్‌తో పనిలేకుండా సోలార్ ప్యానెల్స్ ద్వారా సమకూరుతుంది. ఈ విధానంలో కీటకాలు అభివృద్ధి చెందకుండా కూడా ఈ విధానం పనిచేస్తుంది. ప్రస్తుతం గృహావసరాలకు సరిపడేలా రూపొందించిన ఈ పరికరాన్ని పెద్దఎత్తున వ్యాపార అవసరాలకు వినియోగించేలా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో అభివృద్ధి చేయనున్నారు.

కొత్త ఆలోచనలతో పరిశోధనలపై దృష్టి సారించండి



ఐసర్‌లో జరిగిన జాతీయ సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు

● ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య

ఏర్పేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): నూతన ఆలోచనలతో పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించి రసాయన పద్ధతులు సాంకేతికతల వంటి అంశాలపై చర్చించాలని ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య సూచించారు. ఏర్పేడు మండలంలోని జంగాలపల్లి వద్ద ఉన్న ఐసర్ ప్రాంగణంలో జూలై 29, 30వ తేదీల్లో జాతీయ సదస్సు జరిగిందని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండర్ రీసెర్చ్(ఐసర్) తిరుపతి రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సస్టైనబిలిటీ కోసం రసాయన శాస్త్రం అనే జాతీయ సదస్సు జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సదస్సులో సుస్థిర రసాయన పద్ధతులపై కొత్త పరిశోధనలు, ఆలోచనలు పంచుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 18 ప్రత్యేక ఉపన్యాసాలు జరిగాయి. వీటిలో పదార్థ శాస్త్రం, ఎలక్ట్రో కెమెస్ట్రీ, పచ్చ రసాయన పద్ధతులు, శక్తి నిల్వ సాంకేతికతల వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో 300 మందికి పైగా పీజీ విద్యార్థులు, పరిశోధకులు, పోస్ట్ డాక్టరల్ ఫెలోస్ ఉత్సాహంగా పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.99 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,303

తలనీలాలు సమర్పించినవారు: 27,166

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌పీవోలు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని అధిక ఆదాయం పొందాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రైతు ఉత్పత్తిదారుల సంస్థల(ఎఫ్‌పీవో) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంస్థల సభ్యులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పనిచేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా చిరుధాన్యాల సాగుపైనా దృష్టి సారించాలన్నారు. ఉద్యాన పంటల ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. ఆయిల్‌పాం, ఆక్వా రంగంలోనూ మంచి రాబడులు వస్తున్నాయని వివరించారు. అగ్రిస్టాక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు ద్వారా తీసుకువచ్చే నూతన వ్యవసాయ మార్పులపై సుదీర్ఘంగా వివరించారు. రైతులకు ఉపయోగపడే సమాచారంతో వచ్చిన ఏపీఏఐఎంఎస్ సరికొత్త మొబైల్ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఉద్యానవన శాఖాధికారి దశరథరామిరెడ్డి, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్త కావాలి : కలెక్టర్

● పొదుపు సంఘాల్లో అవకతవకలు నివారించాలి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో ఒక మహిళా పారిశ్రామికవేత్త ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మహిళా పొదుపు సంఘాల్లో అవకతవకలు జరగకుండా ఖాతా పుస్తకాలు ఎప్పటికప్పుడు రాయించాలని ఆదేశించారు. గురువారం తిరుపతిలోని ఓ హోటల్లో ఎంటర్‌ప్రెన్యూర్స్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి సంఘంలోని సభ్యులు జీవనోపాధి ప్రణాళికలు సిద్ధం చేసుకుని, దాన్ని సాధించే దిశగా ముందుకెళ్లాలని సూచించారు. గ్రూపుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్లు

రేణిగుంట, జూలై 31(ఆంధ్రజ్యోతి):చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తుండగా పోలీసులు రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక టాక్టర్‌ను సీజ్ చేశారు. స్టేషన్ రైటర్ చలపతి తెలిపిన వివరాల మేరకు.. బుధవారం అర్ధరాత్రి మండలంలోని వేదాలచెరువు గ్రామంలోని చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులను చూసి కొంతమంది పారిపోయారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి గురువారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 1,200 ఓటర్లు దాటిన తర్వాత అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డీఆర్వో నరసింహులు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నేతలతో గురువారం పోలింగ్ కేంద్రాల సరళీకరణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 33 అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. పేర్ల మార్పు కోసం 8 కేంద్రాలను గుర్తించామని తెలిపారు. 1,200 మంది ఓటర్లు దాటిన 162 కేంద్రాలను గుర్తించామన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల నాయకులను కోరారు.

రాష్ట్రంలో అలజడికి సృష్టించడానికి జగన్ వ్యూహం

● వైసీపీ యాప్ తెస్తే ఆవేదన చెప్పడానికి సిద్ధంగా మద్యం బాధితులున్నారన్న శాప్ చైర్మన్



తిరుపతి(జీవకోన), జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడిప్పుడే రాష్ట్రం గాడిన పడుతుంటే.. అలజడి సృష్టించడానికి వైసీపీ అధినేత జగన్ వ్యూహం పన్నారని శాప్ చైర్మన్ రవి నాయుడు ఆరోపించారు. నెల్లూరు పర్యటనలోనూ కార్యకర్తలను రెచ్చగొట్టి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ, అధికారులను భయపెట్టేందుకు యాప్ తెస్తానంటూ చెప్పడం హాస్యాస్పదమన్నారు. యాప్ తెస్తే వైసీపీ ప్రభుత్వంలో మద్యం ద్వారా ఛిన్నాభిన్నమైన 30 వేల కుటుంబాలతో పాటు బాధితులెందరో తమ ఆవేదన చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ పాలనలో ప్రజాస్వామ్యం నాలుగు పాదాలపై నడిచిందని మంత్రి రోజా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి వస్తే ఎగరేసి తంతామంటూ ఆమె చేస్తున్న వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఎగిరెగిరి మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకోమని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఎప్పుడైనా మహిళలా రోజా ప్రవర్తించారా అని ఆయన ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో చట్టం తన పని తాను చేసుకుపోతోందని, త్వరలోనే మరో కుంభకోణం కూడా బయటకు వస్తుందని చెప్పారు. ఓ మంత్రి రోజాను కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ మీడియా వారు ప్రశ్నించగా అలాంటి వాటికి అవకాశం ఉండదని ఈ శాఖలో తాను ఉన్నానంటూ చెప్పుకొచ్చారు.

సెల్‌ఫోన్ దొంగిలించారంటూ దాడి

● అవమానం భరించలేక మహిళ ఆత్మహత్య ● ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



ప్రసన్న (ఫైల్ ఫొటో)

ఏర్పేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): తమ ఇంట్లో సెల్‌ఫోన్ దొంగలించారంటూ పక్కింటి మహిళపై అనుమానం పెట్టుకున్నారు. తరచూ వేధించారు. నానా మాటలన్నారు. చివరకు దాడి చేశారు. ఆ అవమానం భరించలేక ప్రసన్న (30) ఆత్మహత్య చేసుకుంది. ఏర్పేడు మండలం మన్ననముద్రంలో 25 రోజుల కిందటి ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన ప్రకారం.. మన్ననముద్రంకు చెందిన గోడల కృష్ణయ్య, నారాయణమ్మ దంపతుల కుమార్తె ప్రసన్నకు, దొరవారిసత్రం మండలానికి చెందిన పోలయ్యకు వివాహమైంది. వీరికి ఎనిమిదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇటీవల నారాయణమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ప్రసన్న తన పుట్టింటికి వచ్చారు. జూన్ 30న గంగమ్మ ఇంట్లో సెల్‌ఫోను కనిపించకుండా పోయింది. ఆమె ప్రసన్నపై అనుమానం పెట్టుకుని తిట్టేది. ఈ క్రమంలో జూలై 2న గంగమ్మ కుటుంబీకులు దాడి చేయగా, ప్రసన్న తీవ్రంగా గాయపడ్డారు. దాడి, దొంగతనం నెపం వేశారనే బాధ భరించలేక ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే కుటుంబీకులు తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జూలై 5న మృతి చెందారు. తమ కుమార్తెను అవమానించి దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ కృష్ణయ్య జూలై 10వ తేదీన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారించిన పోలీసులు గంగమ్మతో పాటు ఆమె కుటుంబానికి చెందిన సుబ్రహ్మణ్యం, గురవయ్య, గంగమ్మ, శైలజ, పాపమ్మ, చిట్టెమ్మ, మణెమ్మపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే కేసు నమోదు

తమ కుమార్తె ప్రసన్న ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన 15 రోజుల వరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని కృష్ణయ్య అంటున్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కలిశామన్నారు. ఆయన చొరవతోనే కేసు నమోదైందని అంటున్నారు. కాగా, తిరుపతి ఎంపీ గురుమూర్తి స్వగ్రామంలో.. తమ ఇంటి పక్కన ప్రసన్న ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాన్ని ఇప్పటి వరకు ఎంపీ పరామర్శించలేదని బంధువులు ఆరోపిస్తున్నారు.

12న బీజేపీ 'సారథ్యం'

● రాష్ట్ర పర్యటనలో భాగంగా జిల్లాకు రానున్న మాధవ్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'సారథ్యం' కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆగస్టు12న తిరుపతి నగరం, జిల్లాలో పర్యటిస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తెలిపారు. తిరుపతి నగరం రాఘవేంద్రనగర్‌లో బీజేపీ జిల్లా కార్యాలయాన్ని ఆధునీకరించి.. గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సామంచి మాట్లాడుతూ.. సారథ్యం కార్యక్రమం ఉదయం ఆర్ఎస్ఎస్ శాఖతో ప్రారంభమవై.. స్థానిక ప్రజలతో చాయ్‌పే చర్చ ఉంటుందని చెప్పారు. తర్వాత బీజేపీ నేతలు, కార్యకర్తలతో పాదయాత్రగా కచ్చపి ఆడిటోరియంకు చేరుకుంటారని, కార్యకర్తలతో విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. సాయంత్రం జిల్లాలోని ప్రముఖ పారిశ్రామిక, వ్యాపారవేత్తలతో సమావేశమవుతారన్నారు. ఈ సందర్భంగా మాధవ్ పర్యటన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో



రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

టీటీడీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండ్రిగ ఉమ, చంద్రారెడ్డి, ఎస్ఎస్ఆర్ నాయుడు, కోటేశ్వరరావు, నవీన్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాలాజీ, డాక్టర్ నరేష్‌బాబు, సత్యవేడు మునిక్రిష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అనూష రామకృష్ణ, నరేంద్రరెడ్డి, మల్లకుప్పం శేఖర్, సుబ్రహ్మణ్యంరెడ్డి, వేదవతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు ట్రోఫీల బహూకరణ



ట్రోఫీలతో బ్యాడ్మింటన్ పోటీల విన్నర్స్, రన్నర్స్

తిరుపతి(క్రీడలు), జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో మూడు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీల విజేతలకు గురువారం ట్రోఫీలు బహూకరించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తుడా చైర్మన్ సి.దివాకర్ రెడ్డి, టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందజేసి, అభినందించారు. ఇక్కడ విజయం సాధించిన వారు డిసెంబర్‌లో విజయవాడలో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ టోర్నమెంట్‌ను చిత్తూరు బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

విజేతల వివరాలిలా...

● **మిక్స్‌డ్ డబుల్స్** : వి.వి.హర్షవర్ధన్‌రాయుడు(ఈస్ట్ గోదావరి), కె.నవ్య(చిత్తూరు)లపై హేమచంద్రన్‌సెల్వం, కవిప్రియసెల్వం(విశాఖపట్నం) విజయం

● **ఉమెన్ డబుల్స్** : ఎ.హర్షిక, ఎ.ప్రవల్లికమణి(విశాఖపట్నం)లపై డి.దీపిక, డి.స్రవంతి(గుంటూరు) గెలుపు

● **మెన్ డబుల్స్** : వి.వి.హర్షవర్ధన్‌రాయుడు(ఈస్ట్ గోదావరి), కె.విష్ణుకేదార్(ప్రకాశం)లపై ఎ.భార్గవరామ్(గుంటూరు), జి.విశ్వతేజ్(కడప) విజయం. ● **ఉమెన్ సింగిల్స్** : ఎం.తనిష్క(గుంటూరు)పై కె.నవ్య(చిత్తూరు) గెలుపు. ● **మెన్ సింగిల్స్** : టి.అనిష్‌డేనియల్(నెల్లూరు)పై కె.మోహిత్(తూర్పుగోదావరి)విజయం.

10మంది ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ. 6 లక్షల వంతున జరిమానా

తిరుపతి(నేరవిభాగం),జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో 10 మంది ముద్దాయిలకు ఐదేళ్ళ జైలు శిక్ష విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పునిచ్చారు. వివరాలిలా..2019లో పెరుమాళ్ళ పల్లి బీటు పరిధిలోని ఎస్వీఎన్‌పీ డివిజన్‌లో తమిళనాడులోని తిరువన్నామలై, వేలూరు జిల్లాలకు చెందిన సి.విశ్వనాథ్, డి.సేతు, డి.రమేష్, ఎం.సంపత్, వి.రత్నం, బూచాయాన్, జె.కుమార్, సి.ప్రభు, సురేష్, సి.రామర్‌లు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వీరిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆరేళ్ళ పాటు కేసు విచారణ దశలో ఉన్న ఈ కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి 10 మంది స్మగ్లర్లకు ఐదేళ్ళ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో అధికారులు కఠిన శిక్ష పడేలా సాక్ష్యాధారాలను నిరూపించడంలో సఫలీకృతులయ్యారు.

డ్రగ్స్ నివారణకు సహకరించండి

– ఈగల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ –

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నివారణకు అందరూ సహకరించాలని పోలీసు ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో గురువారం ఎస్వీయూ లా, ఫార్మసీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం ప్రత్యేక ఈగల్ సెల్ ఏర్పాటు చేసిందన్నారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, కలిగి ఉన్నా, వాడినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. దీనిపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్టు తెలిపారు. డ్రగ్స్ గురించి 1972 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఎవరైనా సమాచారం అందించవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ఈగల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, ఎస్వీయూ పీఎస్ ఎస్ఐ కృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పోలీసు ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

అధ్వానంగా దివిపాళెం- చవటపాళెం రోడ్డు




అధ్వానంగా ఉన్న చవటపాళెం- దివిపాళెం రోడ్డు, మలుపు వద్ద రోడ్డుకిరువైపులా ముళ్ల చెట్లు

గూడూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దివిపాళెం గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. దివిపాళెం నుంచి చవటపాళెం మీదుగా గూడూరుకు వచ్చే రోడ్డు ఎన్నో ఏళ్లుగా మట్టిరోడ్డుగా ఉండి అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దివిపాళెం గ్రామంలో సుమారు 2 వేలకు పైగా జనాభా నివాసం ఉంటున్నారు. ఈ గ్రామంలో అధికశాతం గూడూరులో పనులు చేసుకుని జీవిస్తుంటారు. పాడిరైతులు రోజూ గూడూరుకు పాలను తీసుకువచ్చి విక్రయాలు సాగిస్తుంటారు. అంతేగాకుండా తీపనూరు, మేకనూరు, అయ్యవారిపాళెం తదితర గ్రామాల నుంచి గూడూరుకు రాకపోకలు సాగించాలంటే ఈ మార్గం దగ్గర దారి కావడంతో వారంతా దివిపాళెం మీదుగా చవటపాళెం రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ గ్రామాల్లో ఎక్కువ మంది చవటపాళెంలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో పనులు చేసేందుకు వస్తుంటారు. అయితే ఈ మట్టి రోడ్డు గుంతలయమంగా మారడంతో పాటు రోడ్డుకిరువైపులా ముళ్లచెట్లు పెరిగిపోయి అధ్వానంగా మారింది. ముళ్లచెట్లు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాలలో పనులు ముగించుకుని గ్రామాలకు వెళ్లే వారు చీకటిలో మట్టిరోడ్డులోని గుంతలు కనిపించక ప్రమాదాల బారి నపడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలంలో ఈ మట్టిరోడ్డు బురదమయంగా మారుతుండడంతో రాకపోకలు కష్టతరంగా ఉంటాయని చెబుతున్నారు. ఇకనైనా సంబంధింత శాఖ అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

వాకాడు పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

వాకాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వాకాడు పీఏసీఎస్ చైర్మన్‌గా ఉచ్చూరు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి గురు వారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు, టీడీపీ నాయకులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, నన్నారెడ్డి విజయ్‌శేఖర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసేందుకు తన వంతు కృషి చేస్తామని తెలిపారు.

కర్మాగారంలో కార్మికుడి మృతి



మృతుడు శ్రీరామ్

నాయుడుపేట టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట -మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారంలో కార్మికుడు శ్రీరామ్ (25) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. సెజ్‌లోని కర్మాగారంలో ఎలక్ట్రీషన్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీరామ్ గురువారం విధులు నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా సంపులో పడిపోయాడు. గుర్తించిన సహచర కార్మికులు బయటకు తీసి నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలి



బ్యాంక్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకుల్లోకి అనుమానాస్పద వ్యక్తులు వస్తే గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ పరిధిలో అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. లాకర్లు, అలారం సిస్టమ్ సిబ్బంది, కదలికలపై ఎప్పుడుకప్పుడు అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి, రూరల్ సీఐ సంఘమేశ్వరరావు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో ప్రభుత్వ సలహాదారు



సతీష్ రెడ్డిని ఆశీర్వదిస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మ వారిని గురువారం డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జి.సతీష్ రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయంలో ప్రత్యేక పూజలనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి మాజీ సభ్యులు ఆకుతోట రమేష్, కర్లపూడి సురేష్ ఉన్నారు.

చైర్‌పర్సన్, కౌన్సిలర్ల డుమ్మా..!

- వెంకటగిరి మున్సిపల్ సమావేశం వాయిదా



ఖాళీగా ఉన్న కౌన్సిల్ సమావేశం హాలు

వెంకటగిరిటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహించాల్సిన మున్సిపల్ సమావేశానికి చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ డుమ్మాకొట్టారు. ఆమెతో పాటు వైసీపీ కౌన్సిలర్లు 17మంది కూడా హాజరుకాలేదు. దీంతో కౌన్సిల్ సమావేశం వాయిదా వేయాల్సి వచ్చింది. మొత్తం 25 మంది సభ్యులకు గాను సమావేశం నిర్వహించడానికి కోరం 13 మంది సభ్యులు ఉండాలి. అయితే అధికంగా వైసీపీ వారే ఉండడం, వారంతా మాజీ సీఎం జగన్ నెల్లూరు పర్యటనకు వెళ్లిపోయారు. టీడీపీకి చెందిన కౌన్సిలర్లు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభావతి మాత్రమే హాజరయ్యారు. దీంతో కమిషనర్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తర్వాత వెల్లడిస్తామని పేర్కొన్నారు. అనతంరం టీడీపీ కౌన్సిలర్లు మీడియాతో మాట్లాడుతూ వైసీపీ వాళ్లకు జగన్‌మోహన్ రెడ్డి మీద ఉన్న ప్రేమ వెంకటగిరి మున్సిపాలిటీపై లేదన్నారు. మున్సిపాటీలో ప్రజలు సమస్యలతో అవస్థలు పడుతుంటే చైర్‌పర్సన్‌కు పట్టడం లేదన్నారు.

ఏడాదిలోనే సంక్షేమ పథకాలు అమలు

పెళ్లకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే అన్ని సంక్షేమ పథకాలను అమలు చేశారని స్వర్ణముఖి నది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు అన్నారు. గురువారం తన స్వగ్రామమైన భీమవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, దీపం పథకం-2, యువతకు ఉద్యోగ అవకాశాలు తదితర పథకాలను అమలు చేయడంతో పాటు ఆగస్టు 2వ తేదీన రైతు భరోసా, 15న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురిమేటి ఉదయ్ కుమార్‌నాయుడు, నరేంద్రనాయుడు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

వెంకటగిరిటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా హెచ్చరించారు. గురువారం స్థానిక బొగ్గులమిట్ట వద్ద ప్రభుత్వ భూమి, ప్రవేటు లేఅవుట్, కుమ్మరిగుంట లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇరకం దీవిలో కలెక్టర్ పర్యటన

తడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీలు ఇరకం దీవిలో శుక్రవారం పర్యటించనున్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఇరకంలో పింఛన్లను పంపిణీ చేసిన అనంతరం ఇరకం గ్రామస్తులతో గ్రామ సభ నిర్వహించనున్నారు. వారికి ఇళ్ల పట్టాల పంపిణీ తదితర సమస్యలపై గ్రామస్తుల నుంచి వివరాలు, వినతులు స్వీకరించనున్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోట తహసీల్దారు జయజయరావు కోరారు. మండల పరిధిలోని కొక్కుపాడు పంచాయతీ పరిధిలోని లింగాలస్వామిదేవాలయ గిరిజన కాలనీలో గురువారం పౌరహక్కుల దినం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు జయజయరావు స్థానిక గిరిజనులకు రాజ్యాంగ పరంగా సంక్రమించిన హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. అధికారులు ఇంటింటా తిరిగి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్, హౌసింగ్ ఏఈ భాస్కర్ పలు శాఖల అధికారులు ఉన్నారు.

కోట ఎంఈవో-1గా శిరీష



ఎంఈవోను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

కోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కోట మండల ఎంఈవో-1గా శిరీష గురువారం బాధ్యతలు తీసుకున్నారు. పెళ్లకూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమెను పదోన్నతిపై ఇక్కడికి బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈవోగా పనిచేస్తున్న శైలజను ఓజిలికి రెగ్యులర్ ఎంఈవోగా పంపారు.

స్వర్ణముఖిలో ఒకరి గల్లంతు

నాయుడుపేట టౌన్, జూలై31, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపల్లి స్వర్ణముఖి నది వద్ద చేపలవేటకు వెళ్లిన వెంకటేశ్వర్లు (45) గల్లంతయ్యాడు. గురువారం చేపలు పట్టేందుకు వెంకటేశ్వర్లు అదే గ్రామానికి చెందిన వ్యక్తితో కలిసి స్వర్ణముఖి వద్దకు వెళ్లారు. వెంకటేశ్వర్లు నది లోతట్టు ప్రాంతానికి వెళ్లడంతో నీటి ప్రవాహ వేగానికి గల్లంతయ్యాడు. అతడితో పాటు వెళ్లిన వ్యక్తి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించాడు. నదిలో గాలించారు. రాత్రి అయ్యేవరకు గాలించినా ఫలితం లేకుండా పోయింది.

భద్రత పటిష్టం చేసుకోవాలి



బ్యాంకు మేనేజర్లతో మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ, పక్కనే తడ ఎస్ఐ కొండపనాయుడు

సూళ్లూరుపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల వద్ద భద్రత ఏర్పాట్లు పటిష్టం చేసుకోవాలని సీఐ ఎం.మురళీకృష్ణ సూచించారు. సూళ్లూరుపేటలోని బ్యాంకు మేనేజర్లతో గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఇటీవల హిందూపురంలో జరిగిన బ్యాంకు దోపిడీని దృష్టిలో వుంచుకుని ఈ సమావేశం నిర్వహించారు. బ్యాంకుల వద్ద ఎలాంటి భద్రత ఉంది, భద్రతకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, సీసీ కెమెరాలు, అలారం పనితీరు, రాత్రి వేళల్లో సెక్యూరిటీ సిబ్బంది తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని బ్యాంకులకు పోలీసు వాట్సప్ గ్రూపు పెట్టి అందులో భద్రతకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేయాలని సీఐ సూచించారు. రాత్రివేళల్లో సెక్యూరిటీ గార్డు లేదా నైట్ వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకు మేనేజర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో తడ ఎస్ఐ కొండపనాయుడు ఉన్నారు.

మద్యం స్వాధీనం..ఒకరి అరెస్టు

కోట, జూలై31, (ఆంధ్రజ్యోతి): కోట క్రాస్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి కోటయ్య అనే వ్యక్తి నుంచి 20 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిన్నెలపూడికి చెందిన కోటయ్య క్రాస్ రోడ్డు నుంచి బెల్టు షాపునకు తరలిస్తుండగా మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ పవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్యాంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

తడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకుల్లో భద్రతాపరమైన సీసీ కెమెరాలు, అలారంలను ఏర్పాటుచేసుకోవాలని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ బ్యాంక అధికారులను కోరారు. గురువారం తడలోని అన్ని బ్యాంకులను ఆయన పరిశీలించారు. అనంతరం బ్యాంకు అధికారులతో మాట్లాడుతూ హిందూపురంలో బ్యాంకు దోపిడీ జరిగిన కారణంగా బ్యాంకుల్లో పటిష్ట భద్రతను ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. సీఐతోపాటు ఎస్ఐ కొండపనాయుడు ఉన్నారు.

బ్యాంకులలో భద్రతా పరిరక్షణకు ప్రత్యేకచర్యలు



బ్యాంకులో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులలో భద్రతా పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ గీతాకుమారి అన్నారు. గురువారం పట్టణంలోని పలు బ్యాంకులను పరిశీలించి బ్యాంకులలోని భద్రతా రక్షణకు చేపడతున్న ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకుల బయట అమర్చిన సీసీకెమెరాలు తక్కువ రెసెల్యూషన్ కలిగినవిగా ఉండటాన్ని గమనించామన్నారు. వాటి స్థానంలో అధిక నాణ్యత కలిగిన కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించా మన్నారు. అలారం వ్యవస్థ కొంతమందికి మాత్రమే కనెక్ట్ అయిఉందని, తక్షణ స్పందన కోసం పోలీస్‌స్టేషన్‌కు కుడా అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. ఏటీఎంల వద్ద తగిన సిబ్బందిని నియమించాలని తెలిపామన్నారు. ఈ కార్య క్రమంలో సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాలలో డీఎస్పీ గీతాకుమారి విద్యార్థినులకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

జగన్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్



సూళ్లూరుపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పర్యటనకు విచ్చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌ను సూళ్లూరుపేట మున్సిపాలిటీ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



వెంకటగిరిటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాలకొండసత్రంలో పోలేరమ్మ జాతర గురువారం వైభవంగా జరిగింది. బుధవారం అర్ధరాత్రి నుంచి అమ్మవారి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించారు. పోలేరమ్మ జాతర చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పోలేరమ్మ అమ్మవారికి జాతరకు తరలివచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి



రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల

ఓజిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ యంత్రాంగం సన్నద్ధం కావాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం నాయకులకు పిలుపునిచ్చారు. ఓజిలి మండలం మనవాలి వద్ద గురువారం నెమళ్లపూడి రోడ్డు వరకు రహదారి నిర్మాణంలో భాగంగా రూ.1.44 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న రహదారికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలలో ప్రభుత్వం విశ్వాసాన్ని పొందిందన్నారు. సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమంలో ఈ విషయం తెలుస్తోందన్నారు. అందులో భాగంగానే ప్రజల మన్ననలతో మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే స్ఫూర్తితో పనిచేసి విజయం సాధించాలని కోరారు. మనవాలి గ్రామం మీదుగా నెమళ్లపూడి వరకు ఏర్పాటు కానున్న ఈ రోడ్డుతో 15 గ్రామాల ప్రజలకు సమీపంలోని సెజ్‌లో రాకపోకలు సాగించేందుకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. ఆగస్టు 15నుంచి మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం మహిళలందరికి ఊరటనిస్తుందని అన్నారు. గ్రామంలోని సమస్యలను ఈసందర్భంగా ఎమ్మెల్యే, ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ రమణయ్య, ఓజిలి తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవివర్మ, ఏపీఎం పద్మ, ఓజిలి మండల పార్టీ కన్వీనర్ గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ప్రధానకార్యదర్శి దాసరి నిరంజన్, గూడూరు ఏఎంసీ డైరెక్టర్ బచ్చుల రవీంద్రారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు కనుమూరు గోపాల్‌రెడ్డి, యువనాయకులు నెలవల రాజేష్, పార్థసారధి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు కమలాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.